
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5


కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 3 డిసెంబరు 2024


దుర్గాఘాట్‌లో భక్తుల రద్దీ


నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రంలో దీపాలు వదులుతున్న భక్తులు

స్వర్గాన్ని పోలి

అల నక్షత్రాలు ఇల దిగినట్టు కృష్ణానదిలో పోలి దీపాలు కనువిందు చేశాయి. కార్తీకమాసం ముగియడంతో పోలిని స్వర్గానికి పంపే వేడుక సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలు చేసిన మహిళలు అరటి దొప్పల్లో దీపాలు పెట్టి కృష్ణానదిలో వదిలి కార్తీక నోములకు ముగింపు పలికారు. భక్తుల రాకతో తీరప్రాంతాలు కిటకిటలాడాయి. 8లో

ధాన్యం.. దైన్యం..


మోపిదేవి మండలంలో రహదారిపై ధాన్యం ఆరబోత

ఫెంగల్ తుఫాను గండం వీడినా రైతుల కష్టాలు మాత్రం తొలగట్లేదు. నిన్నటివరకు వర్షాలకు పంటను కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడినవారు.. నేడు కాపాడుకున్న ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి, మిల్లర్లు, మధ్యవర్తులకు అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నారు. ఓవైపు ఇస్తానన్న గన్నీబ్యాగులు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తుంటే, మద్దతు ధరను తగ్గించి కొంటూ మిల్లర్లు చుక్కలు చూపిస్తున్నారు.

ఫెంగల్ తుఫాను వీడినా రైతులకు తొలగని కష్టాలు

- గన్నీ బ్యాగులు సమకూర్చని అధికార యంత్రాంగం
- మిల్లర్లు, వ్యాపారులు నిర్ణయించిందే మద్దతు ధర
- మధ్యవర్తుల కనుసన్నల్లోనే ధాన్యం కొనుగోళ్లు
- వర్షం కురవకపోవడంతో ఊపిరి పీల్చుకున్న రైతులు
- అయినా మిల్లుల వద్ద తొలగని ఇక్కట్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఫెంగల్ తుఫాను గండం తప్పడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసి, సోమవారం వాతావరణం సాధారణంగా మారడంతో రాశులుగా ఉన్న ధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షానికి తోడు, బలమైన గాలులు వీయడంతో చేతికందే దశలో ఉన్న వరిపైరు నేలవాలింది. దీంతో వర్షం కారణంగా పంట పొలాల్లో నిలబడిన నీటిని బయటకు పంపే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కోత కోసిన ధాన్యాన్ని విక్రయించేందుకు సంచులు కావాలని రైతులు అడిగినా అధికారులు సమకూర్చడం లేదు. రెండు, మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు చేతికొచ్చే దశలో ఉన్న వరిపైరు నేలవాలడంతో ఎకరాకు రెండు, మూడు బస్తాల ధాన్యం దిగుబడి తగ్గుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. పొలంలో నీరు తగ్గాక వరికోతలను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

గాడినపడని ధాన్యం కొనుగోలు

జిల్లాలోని పలు మండలాల్లో యంత్రాల ద్వారా వరికోతలు కోసి, ధాన్యాన్ని పొలం నుంచి రహదారులపైకి చేర్చారు. రెండు, మూడు రోజుల పాటు వర్షం కురవడంతో ధాన్యం మిల్లులకు తరలించేందుకు అవకాశం లేకుండాపోయింది. ఇప్పటికే 97 లక్షల టన్నులకు పైగా ధాన్యం మిల్లులకు చేరింది. మిల్లుల వద్ద ధాన్యం దించుకునేందుకు జాగా లేకపోవడంతో జిల్లాలోని మిల్లర్లు చేతులెత్తేశారు. ఈసారి మిల్లర్లే ధాన్యం కొనుగోలుకు సంబంధించి గన్నీ బ్యాగులను, రవాణాకు సంబంధించి వాహనాలను సమకూర్చాల్సి ఉంది. గన్నీ బ్యాగులు ఇస్తే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లుగా రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేయాల్సి ఉంది. ఒకవేళ రైతులు మిల్లర్లను, మధ్యవర్తులను బతిమాలుకుని గన్నీ బ్యాగులు తెచ్చుకుంటే.. ట్రాక్టర్లు, లారీల కిరాయి, వాహనాల వెయిటింగ్ చార్జీలు రైతులే భరించాలని మిల్లర్లు షరతులు పెడుతున్నారు. 10 కిలోమీటర్లలోపు దూరం ఉన్న మిల్లుకు టన్ను ధాన్యానికి రూ.250 చొప్పున కిరాయిని రైతులే చెల్లించాలని ఆంక్షలు విధిస్తున్నారు. దూరంలోని మిల్లులకు ధాన్యం రవాణా చేస్తే కిరాయి మరింత అదనంగా వసూలు చేస్తామంటున్నారు. కాగా, మోపిదేవి తదితర మండలాల్లో రాశులుగా పోసి, పరదాలు కప్పి ఉంచిన ధాన్యం అడుగుభాగంలో కొంతమేర మొలకలొచ్చాయి. సోమవారం సాయంత్రం 4 గంటలకు రైతులకు గన్నీ బ్యాగులు అందజేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పినా అమలుకాలేదు.

మద్దతు ధర పెంచరా..?

జిల్లాలో సాధారణ వాతావరణం నెలకొంటోంది. వాతావరణం కొంత అనుకూలంగా మారినా ధాన్యం మద్దతు ధరను పెంచకుండా మిల్లర్లు, మధ్యవర్తులు తమదైనశైలిలో వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ధాన్యంలో 22 నుంచి 25 పాయింట్ల వరకు తేమశాతం ఉంటోందని వారు చెబుతున్నారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి బస్తాకు రూ.1,740, సాధారణ రకం అయితే రూ.1,725 మద్దతు ధరగా ఇవ్వాలి. కొన్నిరోజులుగా నెలకొన్న వాతావరణ పరిస్థితులను బూచిగా చూపి బస్తాకు రూ.1,350 నుంచి రూ.1,400 మాత్రమే మద్దతు ధరగా మధ్యవర్తులు, మిల్లర్లు నిర్ణయిస్తున్నారు. ఈ ధరలోనే ధాన్యం కాటా కూలీల ఖర్చులు, రవాణా చార్జీలు రైతులే భరించాలని వారు చెబుతున్నారు. ధాన్యం రవాణాకు వాతావరణం అనుకూలించకపోవడంతో మండపేట, గుంటూరు, సూళ్లూరుపేట, తిరుపతి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు రెండు మూడు రోజులుగా ధాన్యం కొనుగోలును జిల్లాలో కొంతమేర తగ్గించారు. దీంతో స్థానికంగా ఉన్న మిల్లర్లు మద్దతు ధరను తమ ఇష్టానుసారంగా నిర్ణయిస్తూ రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారు. మండపేట, తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు జిల్లా నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి తీసుకుపోతే, స్థానిక మిల్లర్లు ధాన్యం ధరను కొంతమేర పెంచుతారని, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ధాన్యం కొనుగోలును తగ్గించి మద్దత ధరను నిర్ణయించడంలో స్థానిక మిల్లర్లు చెప్పిందే ధరగా ఉందని రైతులు వాపోతున్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా ధాన్యంలో తేమశాతం పెరిగిందని, దీనిని సాకుగా చూపి బస్తా ధాన్యానికి రూ.300 నుంచి రూ.350 వరకు మిల్లర్లు ధరలో కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇంతా జరుగుతుంటే మధ్యవర్తులను, మిల్లర్లను అదుపుచేసి రైతులకు మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు మిన్నకుండిపోతున్నారు. సంచులు, వాహనాలను మిల్లర్లే సమకూరుస్తారని అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారు. జిల్లాలో ఇంకా 1.40 లక్షల హెక్టార్లలో వరిపంట కోతకు సిద్ధంగా ఉంది. రానున్న రోజుల్లోనైనా ధాన్యానికి మద్దతు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అన్నదాతకు తప్పని నిబంధనాలు

- 1262 ధాన్యం కొనుగోలుకు నిరాకరిస్తున్న మిల్లర్లు 6లో

హాల్ట్ ప్లీజ్..!

షిర్డీ, చెన్నై, హౌరా రైళ్లకు నూజివీడులో హాల్ట్ ఇవ్వండి

- ఏళ్ల తరబడి వినతులు.. పట్టని అధికారులు
- ఎంపీలు చొరవ చూపాలని స్థానికుల వినతి



హనుమాన్ జంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు స్టేషన్ నుంచి షిర్డీ, చెన్నై-హౌరా వెళ్లాలన్న స్థానికుల కల చాలారోజులుగా అలాగే ఉండిపోయింది. ఏళ్ల తరబడి పాలకులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. షిర్డీ, చెన్నై, హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలని సుదీర్ఘకాలంగా నూజివీడు, జంక్షన్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇస్తున్నా పట్టించుకోవడంలేదు.

ఆ రైళ్లను ఆపండి

విజయవాడ-విశాఖ (రత్నాచల్), విశాఖ-సికింద్రాబాద్ (జన్మభూమి), గుంటూరు-విశాఖ (సింహాద్రి), కాకినాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రస్తుతం నూజివీడు స్టేషన్‌లో హాల్ట్ ఉండటంతో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంది. అలాగే, ఈ స్టేషన్ మీదుగానే వారంలో మూడు రోజులు నడిచే కాకినాడ-షిర్డీ (17205, 17206) రైలుకు హాల్ట్ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో పాటు రెగ్యులర్‌గా నడిచే చెన్నై, హౌరా ఎక్స్‌ప్రెస్‌లూ నిలపాలని కోరుతున్నారు. ఇక్కడి ప్రజలు ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏలూరు, గుడివాడకు గానీ, 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడకు గానీ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కూటమి ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సదరు రైళ్లను నూజివీడులో హాల్ట్ కల్పించాలని కోరుతున్నారు.

రెండు రైళ్లు ఆపితే సౌకర్యవంతం

నూజివీడు స్టేషన్‌లో చెన్నై, షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పిస్తే ఈ ప్రాంత ప్రజానీకానికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. చెన్నై, షిర్డీ వెళ్లాలంటే గుడివాడ, ఏలూరు, విజయవాడ వెళ్లాల్సిన పరిస్థితి. స్థానిక ప్రజల వినతులను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు.

- కడియాల సాంబశివరావు, వ్యాపారి

ఎమ్మెల్సీ ఓట్ల గందరగోళం

ఇంకా అండర్ వెరిఫికేషన్‌లోనే దరఖాస్తులు



- తిరస్కరించినవి 10 వేల ఓట్లు
- అండర్ వెరిఫికేషన్, అదర్ మండల్స్ పేరుతో 5 వేలు పెండింగ్
- ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించకపోవడం వల్లేనా?
- ఎమ్మెల్సీ కార్యాలయంలో నిర్లక్ష్య వైఖరి కారణంగానా?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల జాబితాలు గందరగోళంగా మారాయి. అర్హులైన వారికి ఓటుహక్కు రాకపోవటంతో పట్టభద్రులు మండిపడుతున్నారు. 10 వేల దరఖాస్తులను తిరస్కరించటాన్ని ప్రశ్నిస్తున్నారు. వీటిలో సగానికి పైగా అండర్ వెరిఫికేషన్‌లోనే ఉండటం, మరికొన్ని ఇతర మండలాల పేరుతో చూపించడం వివాదంగా మారింది. ఇతర మండలాలు అని ఉంటే.. పట్టభద్రులు చేసిన తప్పేంటి? ఆయా మండలాలకు పంపి వెరిఫికేషన్ చేయాల్సి ఉండగా, ఎన్నికల అధికారులు ఆ పని చేయట్లేదు. దీంతో వేలాది మంది అర్హులైన పట్టభద్రులు ఓటుహక్కును కోల్పోవాల్సి వస్తోంది. ఐదు వేలకు పైగా ఓట్లు ఎందుకు అండర్ వెరిఫికేషన్‌లో ఉంచాల్సి వచ్చిందన్నది అర్థంకాని ప్రశ్నగా ఉంది. గన్నవరం, కంకిపాడు మండలాల పరిధిలో ఈ అండర్ వెరిఫికేషన్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఓటర్ల జాబితా పరిశీలించుకుంటున్న పట్టభద్రులు తమ పేర్లు లేకపోవటంతో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకుంటున్నారు. దరఖాస్తు ఇంకా అండర్ వెరిఫై పేరుతో కనిపిస్తోంది. వీఆర్‌ఏలకు ఫోన్ చేయగా, తమకు వెరిఫికేషన్ చేయమని ఆదేశాలు రాలేదని అంటున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు సంబంధించి ఎన్నికల వెరిఫికేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలుస్తోంది.

విజయవాడ నగరంలోనే అధిక ఓటర్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 3 లక్షల మందికి పైగా పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 10 వేల దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. మొత్తం 2,90,000 మందికి ఓటుహక్కు వచ్చింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ ఓట్ల దరఖాస్తులకు సంబంధించి చూస్తే అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లా నుంచే 60 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 35 వేల వరకు ఒక్క విజయవాడ నగరంలోనివే. మిగిలిన దరఖాస్తులన్నీ కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించినవి.

అండర్ వెరిఫికేషన్‌లోనే..

ఏపీఎన్‌జీజీవో వంటి సంఘాలు స్వచ్ఛందంగా ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాయి. రెండు రోజుల పాటు వెబ్‌సైట్ పనిచేయకపోవటంతో దరఖాస్తులను ఆలస్యంగా నమోదు చేశారు. ఆ తర్వాత దరఖాస్తులు ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆఫీసుకు వెళ్లాయి. తాము ఏపీఎన్‌జీజీవో ఆఫీసులో దరఖాస్తులు ఇస్తే ఎమ్మెల్సీ అశోక్‌బాబు కార్యాలయం మిగతా 6లో..

మెట్రోకు గ్రీన్‌సిగ్నల్



విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం

మొదటి, రెండు దశల పనులకు ఓకే

- ఐదేళ్ల తర్వాత ఆమోదానికి నోచుకున్న డీపీఆర్
- ఇక కేంద్రానికి పంపడమే తరువాయి
- మూడు కారిడార్లుగా పనులు చేసే అవకాశం
- ఇప్పటికే క్షేత్రస్థాయిలో పనులకు శ్రీకారం

నూరుశాతం కేంద్ర ప్రభుత్వ బాధ్యతే..

రాష్ట్ర విభజన సమయంలో ఏపీ రీ-ఆర్గనైజేషన్ యాక్ట్‌ను కేంద్రప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టంలోని 12వ ఐటమ్‌లో పొందుపరిచిన 13వ సెక్షన్‌లో విజయవాడలో మెట్రో రైల్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తన పూర్తి సహకారాన్ని అందిస్తానని పేర్కొంది. దీని ప్రకారం ఫండింగ్ నూరుశాతం కేంద్ర ప్రభుత్వమే భరించాలి. లేదంటే నూతన మెట్రో పాలసీలో ఉన్న క్లాజ్ ప్రకారం కేంద్రం పూర్తిగా తన సొంత ఖర్చుతో నిర్మించాలన్న ప్రతిపాదనను కూడా తీసుకొచ్చారు.

విద్యుత్ తీగలు లేని మెట్రో

మెట్రో ప్రాజెక్టులు అనగానే విద్యుత్ తీగలు కనిపిస్తుంటాయి. పక్క రాష్ట్రాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో విద్యుత్ తీగలతో కూడిన ప్రాజెక్టులే ఉన్నాయి. దేశవ్యాప్తంగా కూడా ఇదే విధానం కొనసాగుతోంది. ఒక్క కేరళ, ఆ తర్వాత మరో రాష్ట్రం తప్ప ఇంకెక్కడా లేదు. కాగా, విద్యుత్ తీగలు లేని మెట్రోల్లో దేశంలోనే మూడోదిగా విజయవాడ మెట్రోకు ప్రాధాన్యం దక్కనుంది. ఈ మెట్రోలో థర్డ్‌రైల్ విధానాన్ని అనుసరించాలని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ భావిస్తోంది. ఈ విధానంలో ట్రాక్ నుంచే విద్యుత్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. తీగలు ఎక్కడా కనిపించవు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆమోదించింది. మొదటి దశ పనులు చేపట్టడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. శిస్ట్రా సంస్థ 2019లో ఇచ్చిన తుది డీపీఆర్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిప్రకారం మొదటి ఫేజ్‌లో విజయవాడలో రెండు కారిడార్లు, రెండో ఫేజ్‌లో అమరావతి రాజధానికి కారిడార్లను నిర్మించేందుకు వీలుగా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌కు ఆమోదం తెలపటంతో కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా పంపటమే మిగిలుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా నూతన మెట్రో పాలసీ విధానంలో నూరుశాతం కేంద్ర సహాయాన్ని కోరుతూ మరోమారు ప్రతిపాదన పంపనున్నారు.

యుద్ధప్రాతిపదికన పనులు

కేంద్రం నుంచి అనుమతులు రాగానే తొలిదశ మెట్రో పనులు ప్రారంభించటానికి ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ సిద్ధంగా ఉంది. తొలిదశలో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్) నుంచి గన్నవరం వరకు కారిడార్-1లో 25.95 కిలోమీటర్లు, పీఎన్‌బీఎస్ నుంచి బందరు రోడ్డు మీదుగా పెనమలూరు వరకు కారిడార్-2లో 12.45 కిలోమీటర్ల చొప్పున మొత్తంగా 38.40 కిలోమీటర్ల నిడివితో పనులు చేపట్టాలని భావిస్తోంది. ఈ పనులపై ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు గ్రౌండ్ ప్రిపరేషన్ చేసి ఉంచారు. కేంద్ర అనుమతులు రాగానే, విజయవాడ నగరంలో కార్పొరేషన్, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలతో కమిటీలు ఏర్పాటు చేస్తారు. కారిడార్ల మార్గంలో ఆయా శాఖలు తక్షణం చేయాల్సిన పనులకు సంబంధించి మొదటి భేటీ ఉంటుంది. భూ సేకరణ ప్రతిపాదనలు గతంలోనే కాబట్టి.. ఆ మేరకు పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. సెంట్రల్ డివైడర్‌పై పిల్లర్ల పనులకు ఇబ్బందులు లేవు కాబట్టి.. భూ సేకరణ జరిగే వరకు వేచి చూడకుండా, ముందుగా టెండర్లు పిలిచి పనులు అప్పగించటం జరుగుతుంది. అన్ని శాఖల పనులు సమాంతరంగా జరిగేలా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఏర్పాట్లు చేస్తోంది.

డ్రోన్ క్యాపిటల్‌గా ఏపీ

డ్రోన్ స్టార్టప్‌లకు రూ. 5 లక్షల ప్రోత్సాహకాలు

- డ్రోన్‌రంగంలో అపార అవకాశాలు
- యువత అందిపుచ్చుకునేందుకు మార్గాలు
- ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె.దినేష్‌కుమార్



6లో

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

8లో

ముస్తాబాద రహదారి గుంతలమయం

భవానీ దీక్షల విరమణకు ప్రత్యేక బందోబస్తు

- అధికారులతో సీపీ సమీక్ష



గుణదల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భవానీ దీక్షల విరమణ ఉత్సవాలకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ రాజశేఖరబాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 21 నుంచి 25 వరకు జరిగే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భవానీ భక్తులు రానున్న నేపథ్యంలో బందోబస్తు నిర్వహణ, ఏర్పాట్ల విషయమై పోలీసు, దేవదాయ శాఖ అధికారులతో కమిషనర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఒక యాప్‌ను రూపొందించాలని, ఎంతమంది, ఏ ఊరు నుంచి, ఏ రోజున వస్తున్నారో తెలిసేలా ఈ యాప్ ఉండాలన్నారు. పార్కింగ్ ఎక్కడ, స్నానఘాట్ ఎక్కడ, వైద్య సౌకర్యాలు ఎక్కడ, ఆన్‌లైన్‌లోనే ప్రసాదం బుకింగ్, దర్శన టికెట్ బుకింగ్, తాగునీటి వివరాలు, గిరిప్రదక్షిణ మ్యాప్, దర్శన సమయాలు, పూజా విధానాలు ఆ యాప్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు. ఈ విషయంపై దేవదాయ శాఖ దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. ఇలా చేయడం వల్ల భక్తుల రద్దీని నియంత్రించవచ్చని చెప్పారు. గిరిప్రదక్షిణ సమయంలో భవానీలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూడాలన్నారు. దీక్షల విరమణ సమయంలో ట్రాఫిక్ ఆంక్షలకు సహకరించాలని ప్రజలను కోరారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

అర్జీల పరిష్కారంలో రాజీపడొద్దు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్య చిన్నదైనా, పెద్దదైనా సమాన ప్రాధాన్యమిచ్చి గడువులోగా పరిష్కరించాలని, ఈ విషయంలో రాజీపడొద్దని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఆర్డీవో ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను అధికారులు గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి దశలోను పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యమిచ్చేలా, అర్జీ రీఓపెన్ అయిన సందర్భంలో రీ వెరిఫికేషన్ శాఖల వారీగా ప్రత్యేక గ్రీవెన్స్ ఆడిట్ అధికారులను నియమించినట్టు వివరించారు. రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించిన అర్జీలకు విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలకు ఆడిట్ అధికారులుగా బాధ్యతలు అప్పగించినట్టు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

ప్రత్యేక అలవెన్స్‌లు ఇవ్వాలి

» ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ డిమాండ్

కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 21 నుంచి భవానీ దీక్షలకు డ్యూటీలు కేటాయించిన వారికి, గతంలో దసరా డ్యూటీలు చేసిన ఆశ వర్కర్లకు ప్రత్యేక అలవెన్స్ టీఏ, డీఏలు ఇవ్వాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విజయవాడ నగరంలో డిసెంబరు 21 నుంచి భవానీ దీక్షా విరమణలకు రాష్ట్రవ్యాప్తంగా వచ్చే భవానీలకు, ఆరోగ్య సేవలందించేందుకు ఆశ వర్కర్లకు విధులు కేటాయించారన్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణ ఖర్చులతో ఆశ వర్కర్లపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక దసరా నవరాత్రుల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భక్తులకు ఆరోగ్యపరమైన సేవలు అందించేందుకు ప్రతీ ఏడాది ఆశ వర్కర్లు మూడు షిఫ్టుల్లో 15 రోజుల పాటు డ్యూటీలు చేశారని తెలిపారు. వీరందరూ ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం రూ.10 వేల మీదే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇప్పటివరకు వారికి ప్రయాణ ఖర్చులు చెల్లించలేదని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆశ వర్కర్లకు ప్రత్యేక అలవెన్స్, టీఏ డీఏలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని, కమల కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి పి.శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు టి.హవేలీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు కృషి

కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు సమష్టిగా కృషి చేద్దామని, లింగ ఆధారిత హింస ఏ రూపంలో వున్నా ఉపేక్షించకూడదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో డీఆర్డీఏ-సెర్ప్ అధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. హింసకు వ్యతిరేకంగా 'ఒకటే స్వరం, వరకట్నం ఇవ్వడం లేదా తీసుకోవడం చట్టరీత్యా నేరం.. వరకట్న వేధింపులు హింసకు దారితీస్తాయి' అంటూ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అదేవిధంగా లింగ వివక్షను రూపుమాపడంలో తమవంతు పాత్ర పోషిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా గళం విప్పాలని, మనచుట్టూ జరిగే హింసను సహించవద్దని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జె.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

» ప్రభుత్వానికి ఏఐవైఎఫ్ వినతి

చల్లపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మంత్రివర్గ సమావేశంలో నిరుద్యోగ సమస్యపై చర్చించి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం చల్లపల్లిలోని చండ్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాజేంద్రబాబు పిలుపునిచ్చారు. ఈమేరకు మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. నూతన పరిశ్రమల్లో యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించిన విశాఖ ఉక్కు కర్మాగారం ప్రవేటీకరణకు వ్యతిరేకంగా, మహిళలపై జరుగుతున్న దాడులు, వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ లంకా నాగమల్లేశ్వరరావు, సిద్ధాబత్తుల వాసు, కొల్లూరి శ్రీధర్, మల్లుపెద్ది రాజా, నక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో భాగంగా వెబ్ డెవలపర్ కోర్సును ఉచితంగా ప్రవేశపెట్టినట్టు జిల్లా నైపుణ్యాధికారి పి.నరేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో చేరగోరు విద్యార్థులు తప్పనిసరిగా ఇంటర్మీడియట్‌ను పూర్తిచేసి ఉండాలన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి లేదా 98488 19682, 9666654641లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

అన్నదాతకు తప్పని నిబంధనాలు!

తుపాను గండం గడిచినా తప్పని కష్టాలు

1262 ధాన్యం కొనుగోలుకు నిరాకరిస్తున్న మిల్లర్లు

ఫెంగల్ తుపాను ప్రభావం తగ్గటంతో ఊపిరి పీల్చుకున్నప్పటికీ ధాన్యం కొనుగోలుకు మిల్లర్ల నిబంధనలు అడ్డు పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం పండించిన పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడిన రైతులు ముందస్తు వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో యాంత్రీకరణతో పంటను కాపాడుకున్నప్పటికీ మిల్లర్లు పెట్టే నిబంధనలకు బెంబేలెత్తుతున్నారు.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కాటా వేస్తున్న సిబ్బంది



దేవరకోట శివారులో 1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని చెబుతున్న రైతు

ఘంటసాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతుల ధాన్యం చివరి గింజవరకూ కొంటామని ప్రభుత్వం ఎన్ని చెప్పినా పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఎలాంటి నిబంధనలు అడ్డురావని, ధాన్యం విక్రయాల్లో తేటతెల్లమవుతుందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రశ్నించిన వారికే న్యాయం జరుగుతుందనటానికి నిదర్శనంగా దేవరకోట గ్రామానికి చెందిన రైతు దోనేపూడి గోపికృష్ణ ధాన్యాన్ని కొనుగోలు చేయటమే నిదర్శనం.

ఘంటసాల మండలం దేవరకోట గ్రామానికి చెందిన టీడీపీ నేత, రైతు దోనేపూడి గోపికృష్ణ తాను సాగు చేసిన 1262 పంటను యాంత్రీకరణ సహాయంతో గత ఐదు రోజుల క్రితం కోతకోసి రోడ్డుపై ఆరబోశాడు. ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు నిరాకరించటంతో సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ విధానాన్ని, మిల్లర్లు అనుసరిస్తున్న నిబంధనలను ప్రశ్నిస్తూ రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీశాడు. దీంతో స్పందించిన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ గోపికృష్ణ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తహసీల్దార్ విజయప్రసాద్‌కు ఆదేశాలు జారీ చేయటంతో సోమవారం ఉదయం హుటాహుటిన సంచులు ఇప్పించి కాటాలు వేశారు. కానీ గోపికృష్ణ ధాన్యానికి కూతవేటు దూరంలో ఉన్న రైతు కన్నా జనార్ధనరావు ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. మండలంలో అచ్చెంపాలెం, తెలుగురావుపాలెం, పాపవినాశనం తదితర గ్రామాల్లో 1262 పంటను సాగు చేసిన రైతాంగం మిల్లర్లు పెట్టే నిబంధనలకు తలొగ్గలేక రోడ్డుపైనే ధాన్యాన్ని నిల్వ పెట్టుకుని దీనంగా చూస్తున్నారు.

1262 ధాన్యం నిరాకరిస్తున్న మిల్లర్లు

1262 ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం అనుమతిచ్చిన రకాలనే సాగుచేసినా 1262 ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయటం లేదని, 1061 ధాన్యానికి అడ్డు రాని నిబంధన 1262కు ఎందుకు వస్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాగా 1061 రకం ధాన్యం క్వింటా మిల్లులో ఆడితే 70 కేజీలకుపైగా బియ్యం వస్తాయని, అదే మిగిలిన రకాలకు చెందిన బియ్యం ఆడితే అంతగా రావనే ఉద్దేశ్యంతో మిల్లర్లు 1262 ధాన్యాన్ని కొనుగోళ్లు చేయటంలేదని రైతులు వాపోతున్నారు. అసలు విషయాన్ని దాచి బిజీలు లేవని, గోడౌన్లు ఖాళీలు లేవని మిల్లర్లు చెబుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతు నాయకుడు వేమూరి రత్నగిరిరావు



ఫెంగల్ తుపాను ప్రభావంతో రైతుల వద్ద నిల్వ ఉన్న పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. బస్తాకు 75 కేజీలు కాకుండా మిల్లర్ 76 కేజీలు కాటాలు వేస్తున్నారు. దీంతో రైతులు కేజీ ధాన్యానికి రూ.23లు నష్టపోతున్నారు. హమాలీల ఛార్జీలు కూడా పూర్తి స్థాయిలో ప్రభుత్వమే చెల్లించాలి.

ఈ-క్రాప్ చేయకపోవటంతో నష్టపోయా

గాజుల నాగ శ్రీనివాసరావు, అచ్చెంపాలెం



పంటకు ఈ క్రాప్ నమోదు చేయలేదు. వ్యవసాయ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. బస్తా రూ.1200లకు తెగనమ్ముకోవాల్సి వచ్చింది. అచ్చెంపాలెం గ్రామంలో అధిక శాతం 1262 రకం సాగు చేశారు. ధాన్యం కొనుగోలుకు మిల్లర్ నిరాకరించటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి 1262 ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

మొలకలను చూపుతున్న రైతు



ధాన్యానికి మొలకలు!

» ఆందోళనలో రైతులు

మోపిదేవి : గడిచిన మూడు రోజులుగా కురిసిన వర్షాలకు రహదారుల వెంబడి ఉంచిన ధాన్యం తడిసి మొలకలు వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పెదప్రోలు, కప్తానుపాలెం, కాసానగర్, శివరామపురం, వెంకటాపురం, మోపిదేవి గ్రామాల్లో యంత్రాల ద్వారా వరి కోతలు, నూర్పిడులు చేపట్టారు. వాయుగుండం ప్రభావంతో కురిసిన అకాల వర్షాలతో రైతులు రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా పోసి పట్టాలు కప్పి కాపాడుకుంటున్నారు. పట్టాల కింద నీరు, తేమ చేరటంతో రాశుల అడుగు భాగంలో ఉన్న ధాన్యం మొలకలు వస్తున్నాయి. మొలకల ధాన్యాన్ని చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తోలుకువెళ్లేందుకు అవసరమైన గోనె సంచులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేకపోవటంతో మరి కొద్దిరోజులు రహదారులపై రాశులుగా ఉంచాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే తేమశాతం సాకుతో ఇష్టమొచ్చిన రీతిలో ధర నిర్ణయిస్తున్నారని, ఇప్పుడు మొలకలు కూడా రావటంతో మా పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు.



కాసానగర్ వద్ద ధాన్యం రాశుల అడుగుభాగంలో వచ్చిన మొలకలు

నిబంధనలు సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- మండవ పవన్ కుమార్, కప్తానుపాలెం కౌలు రైతు

వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని తేమశాతం నిబంధనలు సడలించి గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలి. వెంటనే సరిపడిన స్థాయిలో గోనె సంచులు అందించి రైతులను ఆదుకోవాలి.



ధాన్యం కొనుగోలుకు సంబంధించి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న దేవినేని ఉమా, పక్కన ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

చివరి గింజా కొనాల్సిందే..

» కలెక్టర్ దృష్టికి రైతుల సమస్యలు : దేవినేని ఉమామహేశ్వరరావు

పమిడిముక్కల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యం రకంతో సంబంధం లేకుండా మిల్లర్లు ప్రభుత్వ మద్దతుధర బస్తా రూ.1,740కు కొనాల్సిందేనని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. హనుమంతపురంలో సోమవారం టీడీపీ నేత పరుచూరి వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వచ్చిన నేతలను స్థానిక రైతులు కలిసి 1262 రకం ధాన్యం మిల్లర్లు కొనడంలేదని మొరపెట్టుకున్నారు. దీంతో డీఎస్‌వో, జిల్లా కలెక్టర్ లక్ష్మీశతో ఫోన్‌లో ఉమా మాట్లాడారు. మిల్లర్లతో మాట్లాడి 1262రకం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామని, రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. రైతు పండించిన చివరి గింజవరకు కొనుగోలు చేయాలన్నది ప్ర భుత్వలక్ష్యమన్నారు. దళారులు చెప్పే మాటలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. మిల్లర్లను డిమాండ్‌చేసి, అధికారులను నిలదీసి పనిచేయించుకోవాలన్నారు.

డ్రోన్ క్యాపిటల్‌గా ఏపీ!

» స్టార్టప్‌లకు రూ.5 లక్షల ప్రోత్సాహకాలు

» అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి

» కార్పొరేషన్ ఎండీ దినేష్‌కుమార్

పెనమలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ డ్రోన్ క్యాపిటల్‌గా అవతరించబోతోంది.. ఈ రంగంలో స్టార్టప్‌లు పెట్టడానికి ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం రూ.5లక్షల వరకు ప్రోత్సాహకాలు ఇస్తుంది.. ఈ అవకాశాన్ని యువత అందిపుచ్చుకోవాలని ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం విజయవాడ ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో 12 రోజులపాటు జరిగే 'అడ్వాన్స్‌డ్ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆన్ ఏ డీప్ డైవ్ ఇన్‌టూ అటానమస్ వెహికల్ థియరీ టు ప్రాక్టీస్' శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో డ్రోన్ కీలక రంగంగా అభివృద్ధి చెందబోతున్నదన్నారు. రాష్ట్రాన్ని డ్రోన్ క్యాపిటల్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారని, ఆ దిశగా ఇప్పటికే ఈ రంగంలో ఏపీ ముందుకు వెళుతోందన్నారు. డ్రోన్ తయారీ, సేవల రంగంలో యువతకు అపారమైన అవకాశాలున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రోన్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే వారికి 20శాతం మేర రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఓర్వకల్లు వద్ద మూడువందల ఎకరాల విస్తీర్ణంలో రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతోందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా డ్రోన్ రంగంలో, డ్రోన్ల వినియోగంలో అనూహ్యమైన మార్పులు వచ్చాయని, సాంకేతికత రోజూ కొత్త పుంతలు తొక్కుతూ ప్రజలకు సేవలు మరింత చేరువయ్యేలా చూడటంలో డ్రోన్లు కీలక పాత్ర పోషించనున్నాయని తెలిపారు. సాంకేతిక విద్యాసంస్థలు కూడా డ్రోన్‌రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులకు వివరించాలన్నారు. ఈ దిశగా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వడానికి ముందుకొచ్చే విద్యాసంస్థలకు కావాల్సిన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్‌లలో డ్రోన్లకు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సులు ఏర్పాటు చేస్తున్నామని, డ్రోన్ల సాంకేతికత వినియోగంపై నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ గౌహతి సెంటర్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రదీప్, కళాశాల చైర్మన్ ధనేకుల ఠాగూర్, కార్యదర్శి భవానీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దినేష్‌కుమార్

టీటీడీ నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయల వితరణ

భారతీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మూడో డివిజన్ పరిధిలోని శ్రీరామచంద్ర నగర్ కాలనీకి చెందిన ధనేకుల నాగేంద్రబాబు (బాబి), దుర్గ దంపతులు, వారి కుమారుడు సావంత్ సహకారంతో మండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థాన నిత్య అన్నదాన ట్రస్ట్‌కు 10టన్నుల కూరగాయలను వితరణగా అందించారు. సోమవారం కూరగాయల వాహనాన్ని శ్రీరామచంద్రనగర్ కాలనీలోని అపేజ్ టవర్స్ నుంచి టీటీడీకి యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన ధర్మకర్త సంగా నరసింహారావు జెండా ఊపి పంపించారు. ఈ కార్యక్రమంలో దాతలు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



జెండా ఊపి కూరగాయల లారీని పంపుతున్న ధర్మకర్త సంగా నరసింహారావు, తదితరులు

ఎమ్మెల్సీ ఓట్ల గందరగోళం

(5వ పేజీ తరువాయి)

నుంచి ఫోన్లు వస్తుండటంతో చాలామంది ఓటీపీలు చెప్పలేదు. ఇలా ఓటీపీలు చెప్పని వాటిని కూడా అండర్ వెరిఫికేషన్‌లో పెట్టినట్టు తెలుస్తోంది. ఓటీపీలు చెప్పని వాటిని ఆ కార్యాలయం సిబ్బంది ఆయా మండల కార్యాలయాల్లోని ఎలక్షన్ విభాగానికి పంపిస్తే మాన్యువల్‌గా స్వీకరించేవారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆఫీసు నుంచి ఆయా మండల కార్యాలయాలకు దరఖాస్తులు వెళ్లకపోవడం వల్లే అండర్ వెరిఫికేషన్‌లో పెట్టారన్న విమర్శలు వస్తున్నాయి. తక్షణం అండర్ వెరిఫైడ్, అదర్ మండల్ పేరుతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాగంటి హరిబాబు తదితరులు

1262 రకం విత్తనం కొనుగోలు చేయాలి

కంకిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పినా, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా 1262 రకం ధాన్యం కొనుగోలు చేయడంలో మిల్లర్లు ఆసక్తి చూపించడం లేదని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మండిపడ్డారు. రైతు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ భవన్నారాయణకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర ఇచ్చేందుకు మిల్లర్లు నానా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రైతులకు అవసరమైన గోనుసంచులు, ట్రాన్స్‌పోర్టు సహకారాన్ని సకాలంలో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు తాడంకి నరేష్, జాన్‌మోజస్, దాసు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్స్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలకు సీజనల్ హాస్టల్స్ నిర్వహణకు రిజిస్టర్డ్ స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గుడ్ల మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష సంచాలకుల ఆదేశాలననుసరించి ఎన్టీఆర్ జిల్లాలోని ఐదు (చందర్లపాడు, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, వత్సవాయి, విస్సన్నపేట) మండలాల్లో వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలకు సీజనల్ హాస్టల్లో నిర్వహణకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు మొత్తం 25 సీజనల్ హాస్టల్స్ మంజూరయ్యాయని, వీటి నిర్వహణకు అనుబంధ శాఖలైన ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, స్వయం సహాయక సంఘాలు, రిజిస్టర్డ్ స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తును మెయిల్ ద్వారాగాని లెటర్ ద్వారా గాని తెలియపరచాలని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు రిజిస్ట్రేషన్ యాక్ట్ 1860 ద్వారా గుర్తింపు పొంది మూడు సంవత్సరాల ఆడిట్ కాపీలు, సమస్త బైలా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, దర్పన్ ఐడీ, గతంలో చేసిన కార్యక్రమాలతో విజయవాడ కార్యాలయంలో డిసెంబరు 5లోగా సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ 8712655816 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఉత్కంఠగా టేబుల్ టెన్నిస్ ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ కార్పొరేషన్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ హాల్లో ఉమ్మడి జిల్లాల అండర్-15 బాల, బాలికలు, పురుషులు, మహిళల ఎంపిక పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. పోటీలను సోమవారం రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్ ప్రారంభించారు. రెండు జిల్లాల నుంచి మొత్తం 120 మంది క్రీడాకారులు తలపడ్డారు. రాత్రి వరకు ఈ పోటీలు సాగాయి. విజేతలను మంగళవారం ప్రకటించనున్నారు. ఇందులో సత్తా చాటిన వారిని ఈ నెలలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు. టీటీ జిల్లా అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బొడ్డు శ్రీనివాస్, కోచ్‌లు షారూక్ అక్రమ్, రుత్విక్, గౌస్‌భాషా, ముంతాజ్‌లు పర్యవేక్షించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	105,113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

నీటి తీరువా బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలి

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నీటి తీరువా బకాయిల వసూళ్ల కార్యక్రమాన్ని చేపట్టి సకాలంలో పూర్తిచేయాలని బాపులపాడు తహసీల్దార్ వి.నాగభూషణం వీఆర్వోలను ఆదేశించారు. నీటి తీరువా బకాయిలపై సోమవారం కార్యాలయంలో వీఆర్వోలతో తహసీల్దార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో సరిచేసి రికార్డు సిద్ధం చేయాలని సూచించారు.



వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగభూషణం

15 మంది జూదరుల అరెస్టు

గన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండపావులూరు సర్వే నెంబర్-6 సమీపంలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రాంతం పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం పేకాడుతున్నట్లు సీఐ శివ ప్రసాద్‌కు సమాచారం రావడంతో సిబ్బందిని పంపించారు. వారు వెళ్లి పేకాడుతున్న ఆరుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.5460 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ● జక్కులనెక్కలం ఏలూరు కాలువ కట్టపై కోడిపందేలు వేస్తున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,700 నగదు, ఏడు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేశామన్నారు.



ఆకునూరులో అవగాహన ర్యాలీ

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

ఉయ్యూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని ఆకునూరులో సోమవారం హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు మాట్లాడుతూ, 2030 నాటికి ప్రపంచంలో హెచ్‌ఐవీ పూర్తిగా నిర్మూలించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో హెచ్‌ఐవీ వైరస్ బారిన పడేవారిలో యువత ఎక్కువగా ఉండటం బాధాకరమన్నారు. ఎయిడ్స్ మహమ్మారిపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని పీహెచ్‌ఈ వైద్యురాలు జ్యోత్న్న వివరించారు. ఆకునూరు పాఠశాల విద్యార్థులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ర్యాలీలో పాల్గొన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సత్యనారాయణ, శివనాథ్

కంప్యూటర్ సైన్స్ అంశాల ప్రదర్శన

ఉయ్యూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కంప్యూటర్ సైన్స్ అక్షరాస్యత దినోత్సవం ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ సైన్స్ అంశాల ప్రదర్శనను కళాశాల ప్రత్యేక అధికారి కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ ప్రారంభించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో కంప్యూటర్ జెనరేషన్స్, పురాతన హార్డ్‌వేర్ ఉపకరణాలు ప్రదర్శించారు. మెమరి డివైసెస్, ఇతర హార్డ్‌వేర్ ఉపకరణాలు, నెట్‌వర్క్ కనెక్షన్లు, వివిధ పోస్టర్లు ప్రదర్శించారు. ఇ- క్లాస్‌రూమ్‌లో కంప్యూటర్ అక్షరాస్యతపై క్విజ్ నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి సీహెచ్ అనిల్‌కుమార్, అధ్యాపకులు ప్రభావతి, శ్రీనివాసరావు, కాత్యాయని పాల్గొన్నారు.

వృత్తి విద్యతోనే ఉపాధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : పాఠశాల దశ నుంచే వృత్తి విద్యలో నైపుణ్యం సాధించడం ద్వారా భవిష్యత్తులో ఉపాధికి బాటలు వేసుకోవచ్చని హెచ్‌ఎం పద్మజ విద్యార్థులకు సూచించారు. కానుమోలు హైస్కూల్‌లో వృత్తివిద్యలో శిక్షణ పొందుతున్న 65 మంది విద్యార్థులకు క్షేత్ర స్థాయి పరిశీలన నిమిత్తం సోమవారం హనుమాన్ జంక్షన్‌లోని స్వీట్స్, బేకరీ ఉత్పత్తుల తయారీ విధానాన్ని చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవకుమారి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

గన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాలోం ప్రార్థనా మందిరంలో మొటపర్తి చంద్రసుబ్బారావు జ్ఞాపకార్థం కాశీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధులను ఆదరించటం మానవ ధర్మమని వీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు అన్నారు. అనంతరం వందమందికి దుప్పట్లు అందజేశారు. పాస్టర్ టి.దేవసహాయం, విజయకుమారి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవరపల్లి యేసు బాబు, న్యాయవాది పీహెచ్ విజయ్ కుమార్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ దేవరపల్లి జయరాజు, బాల శ్రీనివాస్, నార్ల సురేష్, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

అధ్వానంగా పారిశుధ్యం

● బండారుగూడెంలో రోడ్డుపైనే చెత్త, వ్యర్థాల డంపింగ్!
● దుర్గంధం వెదజల్లుతున్న పరిసరాలు
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని పంచాయతీ అధికారులు



బండారుగూడెంలో రహదారి పక్కనే పడవేసిన చెత్త వ్యర్థాలు

(హనుమాన్‌జంక్షన్‌రూరల్ - ఆంధ్రజ్యోతి)

గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపైనే చెత్తను డంపింగ్ చేయడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతూ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. బండారుగూడెంలో పారిశుధ్య వ్యవస్థ అధ్వానంగా తయారై ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురిచేస్తోంది. ఇటీవల వర్షాలు పడటంతో చెత్త కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. కుళ్లిన చెత్త దుర్గంధంతో పాటు దోమలు పెరిగి గ్రామంలో వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి పైన గ్రామానికి దగ్గరగా చెత్త వేయడంతో గాలులకు మళ్లీ తిరిగి గ్రామంలోకే వస్తోందని తెలిపారు. దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు డంపింగ్‌పై దృష్టిపెట్టి ప్రధాన రహదారి ప్రక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్య సేవలందించండి

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన సేవలందించే విధంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం ఆసుపత్రి ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందని తెలియజేశారు. అదే విధంగా సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) పాలక వర్గం ఇన్‌చార్జి చైర్మన్‌గా బోయిన రోహిణి కుమారి, డైరెక్టర్లుగా చలవాది రాజ గరికిపాటి రవికిషోర్‌లతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీడీవో అనూష, మండల వైద్యాధికారి సంజయ మంత్ర, కూటమి నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, ముప్పా రాజా, పులి శ్రీనివాసరావు, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, పడవల మధుసూదనరావు, అన్నవరపు శివపార్వతి, బోయిన నాగరాజు, సుంకర శివ, అడపా నాగశ్రీ, ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తాం

● బోయిన రోహిణీ, సీహెచ్‌సీ ఇన్‌చార్జి చైర్మన్

కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తామని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఇన్‌చార్జి చైర్మన్ బోయిన రోహిణీ అన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. పదవి రావడానికి కారణమైన ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన నాయకులు ముప్పా రాజకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు కట్టుబడి నీతి నిజాయితీగా పేదలకు సేవలందిస్తామన్నారు. ఈ సమా వేశంలో పాలకవర్గ సభ్యులు చలవాది రాజా, గరికిపాటి రవికిషోర్ పాల్గొన్నారు.

కానూరులో సీసీ రోడ్డు ప్రారంభం

పెనమలూరు : వైసీపీ రాక్షస పాలనలో కనీసం రోడ్ల అభివృద్ధిని కూడా పట్టించుకోలేదని, వారి పాలనలో రాష్ట్రంలోని రోడ్లకు పడ్డ గుంతలను ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పూడ్చుకొని బాగు చేసుకుంటున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కానూరులో పది లక్షల సాధారణ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించి మాట్లాడారు. జగన్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని, కనీసం ప్రజలు ప్రయాణించేందుకు అవసరమైన రోడ్లకు కనీస మరమ్మతులు చేయకపోవడం వల్ల రాష్ట్రంలో వందల మంది రోడ్డు ప్రమాదాలకు గురై చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన మహా కుంభాభిషేకం



ముగింపు పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

విజయవాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుందావారి కండ్రికలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం, శాంతికళ్యాణం వేడుకలు సోమవారం ఘనంగా ముగిసాయి. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యే కపూజలు నిర్వహించి యాగశాలలో హోమ కార్యక్రమాలను జరిపారు. విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరికట్ల గోవర్ధనశాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్ర మాల్లో భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్య క్రమంలో ఆలయస్థల దాత తిప్పర్తి అచ్యుతప్రసాద్, శశిధర్ దంపతులు ఆలయ మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి గోర్తి శ్రీనివాస్ చక్రవర్తి, ప్రముఖ వైద్యులు వజ్రాల శివకుమార్, మందడపు వెంకటేశ్వరరావు, జివ్వాజి కూర్మాచారి పాల్గొన్నారు.

పార్టీపై అభిమానం..శాశ్వత సభ్యత్వం



1987 నాటి తన సభ్యత్వాల ఫొటో ఫ్రేమ్‌లను మంత్రి లోకేశ్‌కు చూపిస్తున్న తిరుపతిరావు

విజయవాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం మంగళాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సామాన్య కార్యకర్త చాగంటి తిరుపతిరావు సోమ వారం మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వాన్ని పొందారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో రూ. లక్షతో శాశ్వత సభ్యత్వాన్ని పొంది పార్టీపై తన అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం మంత్రి లోకేశ్‌ను కలిసిన తిరుపతిరావు పార్టీ స్థాపించిన నాటి నుంచి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా సభ్యత్వం పొందుతున్నానని తెలిపారు. ఈ సందర్భంగా 1987 నాటి ఫొటో ఫ్రేమ్‌లు కట్టిన సభ్యత్వం కార్డులను చూపించారు. ఆయన వెంట పార్టీ నాయకుడు నాగ భాస్కర్ ఉన్నారు.

హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేత



కార్డులు అందజేస్తున్న ఎంపీడీవో స్వర్ణలత

గన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పేరెంట్స్ టీచర్స్ మీట్ ఈ నెల 7వ తేదీన జరగనుందని దాన్ని విజయవంతం చేయా లని ఎంపీడీవో టి. స్వర్ణలత అన్నారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో సోమవారం హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, గతంలో మాదిరి కాకుండా ఇప్పుడు ఇచ్చిన ప్రోగ్రెస్ కార్డులలో విద్యార్థుల సమగ్ర సమాచారం అంతా ఉంటుందన్నారు. ప్రభుత్వం వచ్చిన తరువాత తొలి కార్యక్ర మమని ఉపాధ్యా యులంతా సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఎంఈవోలు కొండా రవికుమార్, ఆర్.కమల, సీఆర్‌పీ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

గన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్తాబాద జడ్పీ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు సోమవారం ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఫారీ స్కూల్ ఆఫ్ బిజినెస్ పీజీ విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థికి లక్ష్యసాధన తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అప్పుడే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని చెప్పారు. తామంతా కూడా మీ నుంచే పీజీకి వచ్చామని మీరంతా కూడా చదువులో రాణించాలని వివరించారు.

రైలు కిందపడి ఒకరి మృతి



మృతుడు గగన్ (ఫైల్)

ఉంగుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని తేలప్రోలులో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గారపాడు గ్రామానికి చెందిన జంపన గగన్ (33) తేలప్రోలు ఐటీఐ కళాశాలలో పదేళ్లుగా ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నాడు. దీంతోపాటు గత ప్రభుత్వ హయాంలో వాలెంటీర్‌గా పార్ట్‌టైం జాబ్ చేశాడు. ఇతనికి భార్య కీర్తి, పిల్లలు ఇద్దరు పిల్లలు. వీరవల్లిలో మినీక్రిస్మస్ ప్రార్థనలు జరుగుతున్నాయని ఆదివారం ఇంటి నుంచి వెళ్లాడు. భార్య ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో ఆమె గగన్ తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పింది. సోమవారం కుటుంబ సభ్యులు వీరవల్లి వెళ్లి ప్రార్థనల గురించి ఆరా తీశారు. అక్కడ ఎలాంటి ప్రార్థనలు జరగలేదని స్థానికులు చెప్పడంతో ఆత్కూరు, ఉంగుటూరు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో రంగంలోకి దిగిన ఎస్సైలు చావా సురేష్, యు, గోవిందులు గగన్ ఫోన్ సిగ్నల్స్‌ను ట్రేస్ చేశారు. తేలప్రోలు రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకిందపడి మృతి చెందినట్టు గుర్తించారు. స్థానిక పోలీసులు ఈ కేసును రైల్వే పోలీసులకు బదలాయించారు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భక్తులతో శివాలయాలు కిటకిట



మద్దూరులో భక్తుల పూజలు

కంకిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక చివరి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని మద్దూరు ఎన్టీఆర్ పుష్కర్ ఘాట్‌లో భక్తిప్రపత్తులతో పోలిస్వర్గం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నదీతీరంలో వేలాది మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి పోలెమ్మను స్వర్గానికి పంపారు. అరటి డొప్పలలో దీపాలు నదిలో వదిలి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం పోలి పాడ్యమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మహేష్ అభిషేకాలు జరిపారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, వీరమాచనేని నాగయ్య, గూడ పాటి రాంబాబు, తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు తదితరులు పర్యవేక్షించారు.

కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

అయోధ్య అపార్టుమెంట్స్ వద్ద సీఐటీయూ వంటావార్పు



గన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తమకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని బాధిత మేస్త్రులు రామ్మోహనరావు, సతీష్‌లు డిమాండ్ చేశారు. గత ఐదేళ్ల అధికారాన్ని అడ్డు పెట్టుకుని కార్మికుల పొట్టలు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నవరం అయోధ్య అపార్టుమెంట్స్‌లో తాపీ పనులు చేసిన కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వటం లేదంటూ చేస్తున్న రిలే దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేస్త్రీలకు బాకాయిలు రామ్మోహన రావుకు రూ.1.56 కోట్లు, బాబుకు రూ.56లక్షలు, సతీష్‌కు రూ.99లక్షలు, దాస్‌కు రూ.1.40కోట్లు, తేజకు రూ.14లక్షలు, వెంకన్నకు రూ.84లక్షలు ఇవ్వాలని తెలిపారు. అదేమని అడిగితే తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుడైన బిల్డర్ గుర్రం నాని పైసా కూడా ఇచ్చే పని లేదని మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోవాలని బెదిరిస్తున్నారని తెలిపారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలి

పెనమలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ప్రతినిధుల ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులే గెలుపొందేందుకు కూటమి నేతలు, సాగునీటి సంఘాల మాజీ ప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో సోమవారం కూటమి పార్టీల నేతలు, సాగునీటి సంఘాల మాజీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సేవే ధ్యేయంగా పనిచేస్తున్న వ్యక్తులను, రైతు సమస్యలపై అవగాహన ఉన్న వారిని అభ్యర్థులుగా ఎంచుకోవాలని కోరారు. సమావేశంలో ముప్పా రాజా, అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, దేవినేని రాజా, దేవినేని రత్నభూషణ్, కోయ ఆనంద్ ప్రసాద్, సూదిమళ్ల రవీంద్ర పాల్గొన్నారు.



నైట్ లైఫ్..!

ఆంధ్ర ప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటించిన తరువాత విజయవాడ నగరానికి ఎనలేని ప్రాధాన్యత దక్కింది. పైగా నగరంలో నైట్ లైఫ్‌ను అభివృద్ధి చేయాలనే ఒక తలంపుతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఫుడ్‌కోర్టులు, షాపింగ్ మాల్స్, థియేటర్ల వంటి వాటికి 24 గంటల పర్మిషన్ ఇచ్చారు. దీంతో నగరానికి మెట్రో కల్చర్ రాబోతున్నట్టు ప్రజలు ఊహించారు. కానీ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ అనుమతులన్నీ రద్దుచేసి రాత్రి 10 దాటితే రోడ్లపై ఎవరినీ తిరగనీయకుండా చేసింది. దీంతో నగరం ఒక్కసారిగా మూగబోయింది. రాత్రి పది అయిందంటే చాలు నిశ్శబ్ద వాతావరణం నెలకొనేది. పైగా కరోనా రెండేళ్లు ప్రజలు వినోదం, నైట్‌లైఫ్ అనే మాటే మర్చిపోయారు. ప్రస్తుతం చంద్రబాబు మరోసారి సీఎంగా పగ్గాలు అందుకున్నాక ఈ నైట్‌లైఫ్ అనే పేరు లైమ్‌టైమ్‌లోకి వచ్చింది. నగరంలో ఇప్పుడిప్పుడే నైట్‌లైఫ్ అభివృద్ధి చెందుతోంది. రాత్రివేళల్లో స్ట్రీట్‌ఫుడ్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, మాల్స్ వెలుగు జిలుగులతో ఆకర్షిస్తున్నాయి. మెట్రో నగరంగా అభివృద్ధి చెందుతుండటంతో ప్రజల జీవనశైలిలో సానుకూల మార్పులు వచ్చాయి. యువత పనితో పాటు వినోదానికి ప్రాముఖ్యతనిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ కల్చర్ మరింత విస్తరించి, సమీప ప్రాంతాల పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. దీంతో స్థానిక ఆర్థిక వ్యవస్థను మరింత బలపడే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో సైతం పనిచేసే రెస్టారెంట్లు, కేఫేలు ఎంతోమందికి చక్కని ఉపాధిని అందిస్తున్నాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

పండ్ల రక్షణ కాగిత సంచులపై 18 శాతం జీఎస్టీ

● ఎంపీ చిన్ని ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పండ్ల రక్షణకు వినియోగించే కాగితపు సంచులపై దేశవ్యాప్తంగా ప్రస్తుతం 18శాతం జీఎస్టీ అమలవుతోందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. పండ్ల రక్షణకు వినియోగించే కాగితపు సంచులపై జీఎస్టీ వివరాలు తెలపాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీనిపై కేంద్ర సహాయమంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పండ్ల రక్షణ కాగితపు సంచులకు ప్రత్యేకంగా హెచ్.ఎస్.కోడ్ లేకపోవటంతో అయిదేళ్లుగా వీటిపై వసూలైన జీఎస్టీ వివరాలు అందుబాటులో లేవని మంత్రి బదులిచ్చారు. వీటిపై జీఎస్టీ రేటు తగ్గించేందుకు ప్రస్తుతానికి ఎటువంటి ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు. జీఎస్టీ కౌన్సిల్ సూచనల మేరకు రేట్లను నిర్ణయిస్తామన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నుంచి పండ్ల రక్షణ కాగితపు సంచులకు జీఎస్టీ తగ్గిస్తున్నట్టు సమాచారం లేదన్నారు.

వ్యర్థాల నిర్వహణలో నగరం నంబర్ వన్‌గా ఉండాలి

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యర్థ నిర్వహణలో విజయవాడ నగరాన్ని అగ్రస్థానంలో నిలపాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరాన్ని స్వచ్ఛతలో మొదటి స్థానంలో ఉంచేందుకు ఏడేళ్లుగా స్వచ్ఛ సర్వేక్షన్‌లో మొదటి స్థానంలో ఉన్న ఇండోర్ నగరంలో ధ్యానచంద్ర అధికారులతో పర్యటించారు. ఇండోర్‌లో అమలు చేస్తున్న వ్యర్థపదార్థాల నిర్వహణను పరిశీలించారు. అక్కడ అమలు చేస్తున్న ఇంటి వద్దనే వ్యర్థాలను వేరుచేసే విధానం, వారు వాడుతున్న వ్యర్థ సేకరణ వాహనాలు, వాటికున్న జీపీఎస్ మెకానిజం, చెత్త సేకరణ రూటు మారితే జీపీఎస్‌లో గమనించే కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి తెలియపరచి వ్యర్థ సేకరణను కచ్చితంగా జరిగేటట్టు చూసుకునే విధానం, ఎంఆర్‌ఎఫ్ ప్లాంట్, వ్యర్థ నిర్వహణలో ఉపయోగించే టెక్నాలజీ, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విజయవాడకు తగ్గట్టుగా ఇండోర్ వారు వాడుతున్న టెక్నాలజీ, అమలుపరిచి వ్యర్థ నిర్వహణలో అగ్రస్థానంలో నిలపాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెహికల్ డిపో ఏసుపాదం పాల్గొన్నారు.

డైట్ ప్రిన్సిపాల్స్‌గా సీనియర్లను నియమించాలి

● నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

ధర్నాచౌక్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డైట్ ప్రిన్సిపాల్స్‌గా జిల్లా విద్యా శిక్షణా సంస్థలు సీనియర్ డైట్ లెక్చరర్లను నియమించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాయడం జరిగిందన్నారు. ఆ పోస్టుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవారిని రివర్ట్ చేయాలన్నారు. ఎం.హెచ్.ఆర్.డీ, ఎన్.సీ.టీ.ఈ, ఎన్.సీ.ఈ.ఆర్.టీ నిబంధనలు అమలు చేయాలన్నారు. డైట్ ప్రిన్సిపాల్స్ పోస్టులు కేవలం ప్రమోషన్ ద్వారానే నియమించాలన్నారు. పలువురు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా డైట్ ప్రిన్సిపాల్ పోస్టులను ఫీడర్ కేటగిరి వారిని కాకుండా ఇతరులతో నింపడం జరిగిందన్నారు. జీతం కోసం మాత్రమేనంటూ సర్దుబాటు చేయడం అశాస్త్రీయం, నిబంధనలకు వ్యతిరేకమన్నారు. జిల్లా శిక్షణ సంస్థలను బలోపేతం చేయాలని, విద్యారంగ పరిరక్షకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 3 నుంచి 5 వరకు ఆంధ్రప్రదేశ్ 31వ సీనియర్ ఇండియన్ రౌండ్, 44వ సీనియర్ రికర్వ్, 20వ సీనియర్ కాంపౌండ్ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) ఆర్చరీ టోర్నీ నిర్వహిస్తున్నట్టు ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నీలో ఏపీ నుంచి 250 మంది ఆర్చర్లు బరిలో దిగుతున్నారని, పోటీలను మంగళవారం ఉదయం 9 గంటలకు శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రారంభిస్తారని వివరించారు.

కృష్ణమ్మకు పోలి దీపకాంతులు

● భక్తిప్రపత్తులతో పోలిస్వర్గం వేడుకలు ● కృష్ణానదిలో దీపాలను వదిలిన భక్తులు ● భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలి స్వర్గం వేడుక సందర్భంగా భక్తులు అరటి డొప్పల్లో వెలిగించిన దీపాలను కృష్ణానదిలో వదలటంతో నది అంతా దీపాల వెలుగులను విరజిమ్మింది. కార్తీక మాసం ముగింపు సందర్భంగా పురాణేతిహాసాల మేరకు పోలి స్వర్గంను కార్తీకమాసం ముగింపు సందర్భంగా మార్గశుద్ధ పాడ్యమి నాడు పోలి స్వర్గం వేడుకలను హిందూ సంప్రదాయం మేరకు జరుపుకుంటారు. ఈ క్రమంలో సోమవారం విజయవాడ దుర్గాఘాట్ కృష్ణాది వద్ద భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేసి కార్తీకమాసం నెల రోజులు భక్తి ప్రపత్తులతో శివపూజ చేసి స్వర్గానికి వెళ్లిన పోలిని తలచుకుంటూ అదేమాదిరి తమకు కూడా స్వర్గప్రాప్తి కలిగించాలంటూ శివ పార్వతులను వేడుకున్నారు. తెల్లవారుజామునే నదికి తరలి వచ్చిన భక్తులు పవిత్ర స్నానాల అనంతరం అరటి డొప్పల్లో ఆవునెయ్యితో తడిపిన వత్తులను వెలిగించి దీప పూజ చేసి నదిలో వదిలారు. కాంతులీనుతున్న దీపాలు ప్రాతఃసమయాన ఎంతో మనోహరంగా కనిపించి భక్తిభావనలను వెదజల్లాయి. ఇదే సమయంలో సోమవారం కూడా కావటంతో శివాలయాలు కిటకిటలాడాయి. దుర్గగుడిలోని మల్లేశ్వరాలయం, ఇంద్రకీలాద్రి దిగువన విజయేశ్వరస్వామి గుడి, భ్రమరాంబ మల్లేశ్వరాలయం (పాత శివాలయం), యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయం, సత్యనారాయణపురం శివాలయం, రామకోటి మైదానంలోని శివాలయం, చల్లపల్లి బంగా వద్ద శివాలయం, ముత్యాలంపాడులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, మాచవరం డౌన్‌లోని శివాలయం, కొత్తపేట ధర్మేశ్వరాలయం, బ్రాహ్మణవీధిలో వసంత మల్లికార్జునస్వామి గుడి (బుద్దవారి గుడి), ఇలా విజయవాడలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న శివాలయాలను భక్తులు సందర్శించి పూజాధికాలు నిర్వహించారు.





నదిలో దీపాలను వదులుతున్న మహిళలు



సుమిత్ర ధావ్రా, రవిగుప్తాకు చిత్రపటం, ఏఎం రత్నం, జ్యోతికృష్ణకు స్తోత్ర పుస్తకం ఇస్తున్న అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను సోమవారం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుమిత్ర ధావ్రా దర్శించుకున్నారు. అధికారులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. ఆలయ మర్యాదల అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలనంతరం ఆమెకు వేద పండితులు వేద ఆశీస్సులు, ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న రవిగుప్తా

తెలంగాణ ప్రభుత్వ హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా సోమవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికి ఆలయ మర్యాదలు అందించి అమ్మవారి దర్శనం చేయించారు. ప్రత్యేక పూజలు అనంతరం అధికారులు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు. వేద పండితులు వేద ఆశీస్సులందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో సినీ దర్శకుడు జ్యోతికృష్ణ, నిర్మాత ఏఎం రత్నం

ఇంద్రకీలాద్రిపైనున్న అమ్మవారిని సోమవారం హరిహర వీరమల్లు చిత్ర దర్శకుడు జ్యోతికృష్ణ, నిర్మాత ఏఎం రత్నం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. వేద పండితులు ఆశీస్సులందజేశారు. ఈవో రామారావు వారికి అమ్మవారి స్తోత్ర పుస్తకాలను అందజేశారు. అలాగే తెలంగాణ చీఫ్ సెక్రటరీ ఎ.శాంతికుమారి, ఐఏఎస్ అధికారి వి.శేషగిరి, ఇతర అధికారుల బృందం అమ్మవారి దర్శనానికి విచ్చేయగా అధికారులు వారికి స్వాగతం పలకగా డిప్యూటీ ఈవో వారికి దుర్గమ్మ చిత్రపటం అందజేశారు.

ప్రజల మనిషికి మద్దతివ్వండి

● ప్రజా సంఘాల ఆత్మీయ సమావేశం

గవర్నర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా సోమవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో ప్రజా సంఘాల ప్రతినిధుల ఆత్మీయ సమావేశం జరిగింది. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య అధ్యక్షత వహించారు. వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్స్ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున సమావేశంలో పాల్గొని లక్ష్మణరావు విజయం కోసం ఐక్యంగా పనిచేయాలని తీర్మానించారు. విద్యారంగ పరిరక్షణకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న కృషిని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఏ శ్రీనివాసరావు వివరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంసీహెచ్ శ్రీనివాస్, ప్రజారోగ్య వేదిక కన్వీనర్ విజయప్రకాష్, మెడికల్ రిప్ అసోసియేషన్ నేతలు యూవీ కృష్ణయ్య, ఎల్ఐసీ యూనియన్ నేత తులసీరావు, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నేత కె. బాలాజీ, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నేత ఎంవీ ఆంజనేయులు, పోస్టల్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, అమరావతి బాలోత్సవ్ భవన్ అధ్యక్షుడు ఎస్వీ రామరాజు, సచివాలయ ఉద్యోగ సంఘ నేత డీఎం సుభానీ, బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేత సీహెచ్ రాములు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. లింగారెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేత ఎన్‌సీహెచ్ సుప్రజ, శ్రామిక మహిళా కన్వీనర్ కమల, సీపీఎం అనుబంధ సంఘాల నేతలు ఎస్ దేవ్, మల్లికార్జునరెడ్డి, రామారావు, వెంకటరమణ పాల్గొని లక్ష్మణరావుకు మద్దతు పలికారు.

జిల్లా ఎఫ్ఎస్‌వోగా రవీంద్రరావు



కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి (ఎఫ్ఎస్‌వో)గా ఎ.రవీంద్రరావు సోమవారం విజయవాడ స్టేట్ గెస్ట్‌హౌస్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో నందిగామ ఆర్డీవోగా పనిచేసిన రవీంద్రరావును ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. టీమ్ ఎన్టీఆర్‌లో భాగమవుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ నూతన ఎస్ఎఫ్‌వోకు సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్

వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

● పిన్నమనేనిలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టీమ్ ఎంపిక

గన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో సోమవారం డాక్టర్ ఎన్టీఆర్ వర్శిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలలు, దంత వైద్య కళాశాలలు, నర్సింగ్, హోమియోపతి కళాశాలల విద్యార్థులకు ఫుట్‌బాల్ టీమ్ సెలక్షన్ జరిగాయి. క్రీడాకారులను పరిచయం చేసుకుని డాక్టర్ భీమేశ్వర్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. వైద్య విద్యార్థులకు క్రీడలు ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. 80 మంది వైద్య విద్యార్థులు రాగా 16 మంది ఫుట్‌బాల్ టీమ్‌కు సెలక్ట్ అయ్యారు. వర్శిటీ సెలక్షన్ కమిటీ సభ్యులు ఈ త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆర్చరీలో విజయవాడ క్రీడాకారులకు స్వర్ణాలు



విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లో ఈ నెల 1న జరిగిన మూడో జాతీయ విలువిద్య (ట్రెడిషనల్ ఆర్చ రీ) టోర్నీలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన విజయవాడ నగర క్రీడాకారులు స్వర్ణాలతో సత్తాచాటారు. పాల్గొన్న ముగ్గురూ స్వర్ణాలను వ శం చేసుకోవడం గమనార్హం. స్వర్ణాలు సాధించిన సిరంగి సురేష్, ప్రశాంత్, అ ద్వైత్‌ను కోచ్, ఏపీటీఏఏ సెక్రటరీ అలుగోలు నాగేశ్వరరావు అభినందించారు.



ముస్తాబాద రహదారి గుంతలమయం

ప్రసాదంపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు ఫ్లై ఓవర్ నుంచి ముస్తాబాదకు వెళ్లే రహదారి గుంతలమయమైంది. భారీ వాహనాలు ప్రయాణం సాగించే ఈ రహదారి గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైంది. రహదారిపై గుంతలు పూడ్చే కార్యక్రమం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చినా ఈ రహదారి వైపు కన్నెత్తి చూడటం లేదు. పైగా ఇటీవల వచ్చిన వరదలకు రోడ్డంతా కొట్టుకుపోయి రహదారి అంతా రాళ్లు తేలి గతుకులమయం కావడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని ద్విచక్ర వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రహదారి మరమ్మతులు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముస్తాబాద వెళ్లే రహదారికి మోక్షం ఎప్పుడు కలుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

శరవేగంగా నిర్మాణం పూర్తిచేసుకున్న ఐజీఎంసీ టాయిలెట్లు

● ఆంధ్రజ్యోతి కథనానికి వేగంగా చర్యలు



ఆధునీకరించిన స్టేడియం టాయిలెట్లు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియానికి తగ్గట్టుగా వీఎంసీ ఉన్నతాధికారులు టాయిలెట్లు నిర్మించి తమ నిబద్ధతను చాటుకున్నారు. ఇక్కడ టాయిలెట్ల దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో ఛీ..ఛీ ఇదేం దుస్థితి శీర్షికన సెప్టెంబరు 20న ప్రచురితమైన ప్రత్యేక కథనానికి కమిషనర్ ధ్యాన్‌చంద్ర స్పందించి పాడైన వాటిని పూర్తిగా మరమ్మతులు చేయించడానికి ఆదేశించారు. రెండు నెలల వ్యవధిలోనే శరవేగంగా టాయిలెట్లు ఆధునీకరించగా, అవి ప్రారంభానికి సిద్ధమయ్యాయి. బాలుర, బాలికలకు వేర్వేరుగా ఆధునీకరించగా, ఇందులో అధునాతన విద్యుత్ లైట్లు, వైరింగ్ అమరికతో పాటు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు, వాకర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటిని త్వరగా ప్రారంభించే బాధ్యతను వీఎంసీ కమిషనర్ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మొరాయిస్తున్న సిటీస్కాన్

● అవస్థలు పడుతున్న రోగులు

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వాసుపత్రిలో సిటీ స్కానింగ్ మిషన్ మొరాయించడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. 22 రోజులుగా సిటీ స్కానింగ్ లేక ఇక్కట్లు పడుతున్నామని రిపోర్టులు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సర్జరీలు నిలిచిపోయాయని ఆవేదన చెందుతున్నారు. సిటీ స్కాన్ రిపోర్టు, ఫిలిం ఇవ్వలేని దయనీయ స్థితిలో ప్రభుత్వాసుపత్రి వైద్యులున్నారని రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని అంటున్నారు. ఆసుపత్రిలో పదే పదే మిషన్లు పనిచేయక రోగులు పడుతున్న ఇబ్బందులపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ స్పందించాలని, రోగుల వైద్యానికి కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని వారి బంధువులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

సెక్ కోడిగుడ్లు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.620

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తోట్లవల్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రొయ్యూరు నుంచి కంకిపాడు వెళ్లే జడ్పీ రోడ్డుకు మంజూరైన ఉపాధి హామీ నిధులు రూ.కోటితో 1.211 కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్డు నిర్మించడానికి సోమవారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాసు, టీడీపీ నాయకులు ఉప్పులూరి గోపాలకృష్ణ, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రొయ్యూరు-కంకిపాడు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

ఫీజు చెల్లించలేదని హాల్‌టికెట్లు ఇవ్వకపోవడం సరికాదు



వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరావుతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుడివాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కళాశాల ఫీజు చెల్లించలేదని వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం అన్నారు. కళాశాల బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులు 35 మందికి ఫీజు చెల్లించలేదని హాల్‌టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకుని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాదరావుతో ఆయన మాట్లాడారు. సాయంత్రం లోపు హాల్‌టికెట్లు ఇస్తామని చెప్పారని విలేకరులకు తెలిపారు. విడతల వారీగా ఫీజు మొత్తాన్ని చెల్లిస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టంగా చెప్పినా, విద్యార్థులను ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని మంత్రి లోకేశ్‌ను సమరం కోరారు. ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.



హనుమంతపురంలో పరుచూరి వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమా, ఎమ్మెల్యే కుమార్‌రాజా

టీడీపీ నాయకుల కుటుంబాలకు పరామర్శ

పమిడిముక్కల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకుల కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కుమార్‌రాజా, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి గురుమూర్తి సోమవారం పరామర్శించారు. అలీనఖీపాలేనికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు మీర్జా మహ్మద్ అలీ కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. హనుమంతపురంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తెను పరామర్శించి, వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. కపిలేశ్వరపురంలో చెరుకూరి కృష్ణమోహన్ కుటుంబసభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేశ్, లింగంనేని బాబూరావు, బొల్లా మల్లికార్జున్, కె.జయచంద్, నాదెళ్ల సుబ్రహ్మణ్యం, మైనేని నరేంద్ర, కొల్లిపర బాబి, బుల్లెట్ బాబి, రామాంజనేయులు, యండూరి పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.





కూచిపూడిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు, తోట్లవల్లూరులో ధాన్యం పరదా కింద తేమ

ఫెంగల్ మిగిల్చిన

కష్టం..నష్టం

- వర్షాలు ఆగడంతో ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు
- పరదాలు, కూలీల ఖర్చు భరించలేకపోతున్నామంటూ ఆవేదన
- తేమశాతం ఎక్కువగా ఉన్నా ధాన్యం కొనాలని ప్రభుత్వానికి వేడుకోలు

కూచిపూడి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలు రైతులకు కష్టాన్ని..నష్టాన్ని మిగిల్చాయి. సోమవారం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ధాన్యపు రాశులపై కప్పిన పరదాలు తొలగించి ఆరబెట్టుకుంటున్నారు. కోత కోయని పొలాల్లో నేలకొరిగిన వరి దుబ్బులను పైకి లేపి కట్టుకుంటున్నారు. చేలల్లో నిలిచిన నీటిని బయటకు మళ్లిస్తున్నారు. కాటాలు వేసి నిల్వ ఉన్న ధాన్యాన్ని అధికారులు చొరవ చూపి త్వరితగతిన మిల్లులకు చేర్చాలని రైతులు కోరుతున్నారు. రెండో పంట కోసం చల్లిన మినుము విత్తనాలు దెబ్బతిన్నాయని, సబ్సిడీపై ప్రభుత్వం మినుము విత్తనాలు అందించాలని కోరుతున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా, పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తేమశాతం పెంచి కొనుగోళ్లు చేపడితే కొంతవరకు నష్టాన్ని తగ్గించుకునే వీలుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరికోతలు పునఃప్రారంభం

పమిడిముక్కల: మండల పరిధిలో రైతులు వరి కోతలు తిరిగి మొదలుపెట్టారు. తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న కారణంగా కోతలు కోయకుండా నిలిపివేసిన రైతులు సోమవారం కొద్దిగా ఎండ కాయడంతో యంత్రాలు, కూలీలతో వరికోతలు మొదలుపెట్టారు. పంట కోతకు వచ్చి తరుణం మించిపోతోందని, వరికంకుల నుంచి గింజలు రాలిపోతున్నాయని, కోసినా ఇంతకంటే నష్టపోయేదేముందంటుందని కోతలు ప్రారంభించామని కపిలేశ్వరపురానికి చెందిన కౌలురైతు ఉప్పాల శ్రీనివాసరావు తెలిపారు.



తాడంకిలో వరి కోత కోస్తున్న కూలీలు

ధాన్యం దిగుమతి చేసుకోని మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

గుడివాడ: ధాన్యం దిగుమతి చేసుకోకుండా కొందరు మిల్లర్లు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం దిగుమతిలో మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరుతో కౌలు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిల్లుల వద్ద దిగుమతి చేసుకోకపోవడంతో నాలుగైదు రోజులుగా లారీలు నిలిచిపోతున్నాయని, తడిచిన ధాన్యం లారీల్లో ఉండటం వలన రంగు మారుతోందని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.



ఆర్డీవో కార్యాలయంలో డీటీ బాలాజీకి వినతి పత్రం అందిస్తున్న కౌలురైతు సంఘం నేతలు

తేమశాతం నిబంధన సడలించాలి

గుడివాడ: తేమశాతం నిబంధనను సడలించి 48 గంటల్లో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మద్దతు ధర రూ.1730కు కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కనీస మద్దతు ధర తగ్గకుండా తడిచిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయపు డిప్యూటీ తహసీల్దార్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు.

దావులూరు మిల్లుకు వెళితే కొంటామన్నారు

- తీరా గోనె సంచులు తెచ్చాక లేదన్నారు
- తోట్లవల్లూరు రైతు గొరిపర్తి రమేష్ ఆవేదన



ధాన్యం అమ్ముడవలేదని ఆవేదన చెందుతున్న రైతు గొరిపర్తి రమేష్

తోట్లవల్లూరు: గత బుధవారం ఎకరన్నర పొలంలో యంత్రంతో ధాన్యాన్ని కోసి ఆరబెట్టామని, దావులూరులో ఉన్న రైస్‌మిల్లుకు వెళ్లి సంప్రదిస్తే పచ్చి ధాన్యాన్ని కొంటామని తెలిపారని తోట్లవల్లూరుకు చెందిన రైతు గొరిపర్తి రమేష్ తెలిపారు. ఆర్ఎస్‌కే సిబ్బందికి చెబితే గోనె సంచులిచ్చారని, తీరా అక్కడ ధాన్యం కొనటం లేదని కాటా వేయకుండా ఆపించేశారని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఖర్చు భరించలేకపోతున్నాం

రెండు రోజుల పాటు వానతో అల్లాడిన రైతులు సోమవారం పరదాలు తొలగించి ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. ఒక్కో పరదాకు రూ.25 నుంచి రూ.30 చొప్పున రోజుకు రూ.300 అద్దె, ఎకరం ధాన్యం ఆరబెట్టి మళ్లీ సాయంత్రం గుట్టగా చేసి పరదాలు కప్పేందుకు ముగ్గురు కూలీలకు రోజుకు రూ.1,200 చొప్పున ఖర్చు చేస్తున్నామని, ఇలా వారం రోజులుగా ఖర్చు భరించలేకపోతున్నామని రైతులు చెబుతున్నారు. పరదాలతో ఎంత జాగ్రత్త చేసినా రోడ్డు కింద నుంచి ధాన్యానికి తేమ సోకుతుండటంతో ధర తగ్గిస్తారేమోనని ఆందోళనగా ఉందని రైతులు చెబుతున్నారు. వానకు ముందు 17 శాతం తేమ ఉన్న ధాన్యం ఇపుడు 20కి పెరిగిందని కొందరు రైతులు తెలిపారు. మిల్లుల వద్ద తీసిన తేమశాతాన్నే మిల్లర్లు పరిగణనలోకి తీసుకుని, ధరలో కోత కోస్తున్నారని, అధికారులు పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు నష్టం వాటిల్లకుండా చూడండి

- అధికారులకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదేశం

పెదపారుపూడి: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా, నష్టం వాటిల్లకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదేశించారు. సోమవారం మండలంలో ఎమ్మెల్యే పర్యటించారు. రైతులు, కౌలురైతుల సమస్యలు తెలుసుకున్నారు.



మహేశ్వరపురంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

భక్తిశ్రద్ధలతో

పోలిస్వర్గం



కూచిపూడిలో, పామర్రు పుల్లేటి కాల్వ వద్ద అరటిదొప్పల్లో దీపాలు వెలిగించి నీటిలో వదులుతున్న మహిళలు

కూచిపూడి/పామర్రు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పూర్తయిన సందర్భంగా మార్గశిర శుద్ధ పాడ్యమి సోమవారం పోలి స్వర్గం నోముల కార్యక్రమాన్ని పలు గ్రామాల్లోని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పంట కాలువలు, చెరువుల వద్ద అరటిదొప్పల్లో దీపాలు వెలిగించి వాటిని మహిళలు కాల్వల్లో వదిలారు. పోలిని స్వర్గానికి సాగనంపారు. కొండిప్రరు రోడ్డులోని పామర్రు పుల్లేటి రేవు వద్ద వేకువజామునే అధిక సంఖ్యలో భక్తులు పుల్లేటిలో స్నానాలు అచరించారు. శివాలయంలో పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. కూచిపూడి, చిన్నముత్తేవి, గూడపాడు, మొవ్వ, కాజ, కోసూరు, నిడుమోలు, పెదపూడి గ్రామాల్లో శివాలయాల్లో అభిషేకాలు, విశేష పూజలు జరిపారు.



ట్రోఫీ అందుకుంటున్న ఎస్ఆర్‌జీఈసీ విద్యార్థినులు

టేబుల్ టెన్నిస్ విజేతలు ఎస్ఆర్‌జీఈసీ, జేఎన్టీయూ కాకినాడ

గుడ్లవల్లేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే అంతర కళాశాలల టేబుల్‌టెన్నిస్ పోటీలు ఆది, సోమవారాల్లో శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ)లో నిర్వహించారు. మహిళా విభాగంలో మెదటి బహుమతి ఎస్ఆర్‌జీఈసీ, ద్వితీయ బహుమతి స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల నర్సాపురం, తృతీయ బహుమతి వీవీపీ ఐటీ, వీఆర్ సిద్ధార్థ కళాశాల విజయవాడ కైవశం చేసుకున్నాయని ఎస్ఆర్‌జీఈసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. పురుషుల విభాగంలో ప్రథమ స్థానం జేఎన్టీయూ కాకినాడ, ద్వితీయస్థానం వాసవీ ఇంజనీరింగ్ కాలేజీ తాడేపల్లిగూడెం, తృతీయస్థానం ఎస్ఆర్‌జీఈసీ, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల భీమవరం కైవశం చేసుకున్నాయి. జేఎన్టీయూకే టేబుల్‌టెన్నిస్ టీమ్ మహిళా జట్టుకు ఎస్కే. పర్వీన్, ఎ.హెచ్.సంకీర్తన, పి.హర్షిత ఎస్ఆర్‌జీఈసీ, డి.సునీత ఎస్ఐటీ నర్సాపురం, బి.నిఖిత గాయత్రి విద్యాపరిషత్ విశాఖపట్నం విద్యార్థినులు ఎంపికయ్యారు. పురుషుల విభాగంలో ఏడీ మణికంఠ, డి.శ్యామ్‌సన్ అశోక్ యూనివర్సిటీ కళాశాల కాకినాడ, ఎన్.గణేష్ ఎస్వీఈసీ తాడేపల్లిగూడెం, జి.నాగవైభవ్ పొట్టిశ్రీరాములు విజయవాడ, షేక్ అబ్దుల్ రియాన్ నిమ్రా కాలేజ్ విజయవాడ ఎంపికయ్యారని కరుణకుమార్ తెలిపారు. విజేతలకు జేఎన్టీయూకే క్రీడా కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఎస్ఆర్‌జీఈసీ ప్రిన్సిపాల్ కరుణకుమార్ బహుమతులు ప్రదానం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గుడివాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జనసేన నాయకుడు షేక్ నాగూర్‌బాషా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. జనసేన నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, నాయకులు మజ్జి శ్రీనివాసరావు, చింతా రామకృష్ణ, శాయన రాజేష్, సీతారాం, వెంకట్రావు, మీరా షరీఫ్, సుంకర వెంకట్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో నలుగురికి ఉద్యోగాలు

గుడ్లవల్లేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం థాట్ వర్క్స్ టెక్నాలజీస్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిప్లమా విద్యార్థులు జి.మోహంతి, జి.రష్మిక, జి.జ్యోతి ప్రవీణ్, జి.చిరంజీవి రూ.8 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఎం.వినయ్‌కుమార్, కంప్యూటర్స్ విభాగాధిపతి ఎ.కృష్ణచైతన్యను చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎన్.ఎస్.ఎన్.వి.రామాంజనేయులు, ప్రిన్సిపాల్ రాజశేఖర్ అభినందించారు.

ఫార్మర్ చాట్ యాప్‌తో ఉద్యాన రైతులకు మేలు

తోట్లవల్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగులో ఏ సమస్య వచ్చినా తెలియజేసి సలహాలు పొందేందుకు ఫార్మర్ చాట్ యాప్‌ను రూపొందించారని, రైతులు ఎక్కడ నుంచైనా ఈ యాప్ ద్వారా చీడపీడల నివారణకు సలహాలు తెలుసుకునే అవకాశం ఉందని మండల ఉద్యానశాఖ అధికారి చందు జోసఫ్ సుందరం తెలిపారు. భద్రిరాజుపాలెంలో సోమవారం ఉద్యానశాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయంలో డిజిటల్ సేవలు పొందటంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు డిజిటల్ సేవలను పొందేందుకు ఫార్మర్ చాట్ యాప్‌ను రూపొందించామని, ఈ యాప్ ఓపెన్ చేసి పంటలకు వచ్చిన తెగుళ్ల ఫొటోను పెట్టి సలహాలు పొందొచ్చని, డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి కమలాకర్ తెలిపారు. మార్కెట్ ధరలు, వాతావరణ పరిస్థితులు, ఎరువుల యాజమాన్యం సమాచారం లభిస్తుందని, ప్రతి రైతు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

గుడివాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ ఆంక్షలను విధించామని, వాహనదారులు తప్పనిసరిగా నియమాలను పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ సూచించారు. సోమవారం భీమవరం రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ నియంత్రణను ఆయన పరిశీలించారు. భీమవరం రైల్వేగేటు, కేటీఆర్ కళాశాల వద్ద ఉన్న రైల్వేగేట్ల వద్ద వన్‌వే నిబంధన అమలులో ఉందన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే జరిమానాతో పాటు చర్యలు తప్పని ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు.

ఎయిడ్స్ బాధితుల్లో మనోధైర్యం నింపాలి

గుడివాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బాధితుల్లో మనోధైర్యాన్ని నింపి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ సీహెచ్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఎన్ఆర్ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. హెచ్ఐవీ బాధితులను అంటరాని వారిగా చూడరాదని, 2030 నాటికి ఎయిడ్స్‌కు సరైన ఔషధం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎయిడ్స్ సంక్రమించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎయిడ్స్ యాక్టు 2017, ఏఆర్టీ చికిత్సా విధానం, టోల్‌ఫ్రీ 1097పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ఆర్.కె.ప్రసాద్, కె.ఎస్.అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

గుడ్లవల్లేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అపరిచితులు ఎవరైనా చాక్లెట్లు, బిస్కెట్లు ఇస్తామంటే తీసుకోవద్దని విద్యార్థులకు షీటీమ్ సూచించింది. శ్రీసాయి విద్యా నికేతన్‌లో సోమవారం విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై షీ టీమ్ కానిస్టేబుల్స్ జి.అరుణ, బి.అలివేలుమంగ అవగాహన కల్పించారు.

అత్యాచార నిందితులను

కఠినంగా శిక్షించాలి

గుడివాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించడంలో విఫలమైందని, ప్రతి గంటకూ అత్యాచారాలు జరుగుతున్నాయని, అత్యాచారాలకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ, ఐద్వాల ఆధ్వర్యంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు పి.రజిని, జి.కుమారి, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

గుడివాడ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు, ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్, వెలుగుశాఖల అధికారులు పాల్గొన్నారు. అన్ని శాఖల అధికారులు వచ్చే సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ సూచించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. వ్యవసాయం, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

రహదారి పనుల గడువు పెంచాలి : పార్లమెంటులో ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధి పనుల గడువును పెంచాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి సోమవారం పార్లమెంట్‌లో కోరారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ సహాయంతో ఏపీలో ఏడు వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి గతంలో ప్రత్యేక రోడ్‌ప్రాజెక్టును రూపొందించగా, 2019-2024 సంవత్సరాల మధ్య పనులు సక్రమంగా జరగలేదన్నారు. ఈ పనులను పూర్తి చేసే గడువును 2026 డిసెంబరు వరకు పెంచాలని ఆయన కోరారు. కాగా, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బాలశౌరి ఢిల్లీలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రచారం, మహారాష్ట్రలో మహాయుతి విజయం నేపథ్యంలో అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి వ్యాఖ్యలకు ఖండన

అవనిగడ్డ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గాన్ని నిర్మాణాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌పై ఆరోపణలు చేయటం మాజీ ఎమ్మెల్యే మానుకోవాలని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం అవనిగడ్డలో కూటమి నేతలు బుద్ధప్రసాద్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మత్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసం బుద్ధప్రసాద్‌పై అవాకులు, చెవాకులు పేలటం మానుకోవాలని హితవు పలికారు. ఇసుక, బుసక, బ్లాక్ శాండ్ అమ్ముకుని కోట్లు దోచుకున్న వారికి బుద్ధప్రసాద్‌ను విమర్శించే నైతిక అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. బండే రాఘవ, కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, రాజనాల వీరబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, బచ్చు రఘునాథ్, మౌలాలి, కర్రా సుధాకర్, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగుల అలంకరణ కోసం బందరుకు పైడమ్మ

పెడన, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14 నుంచి 24 వరకు జరిగే జాతర ఉత్సవాలను పురస్కరించుకుని పైడమ్మ తల్లి రంగుల అలంకరణ కోసం మంగళవారం ఉదయం బయలుదేరి మచిలీపట్నం వెళ్లారు. కొత్తపేటలోని ఆలయం నుంచి మచిలీపట్నం బయలుదేరిన పైడమ్మతల్లికి ఆలయం వద్ద ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా బయలుదేరి మచిలీపట్నం వెళ్ళారు. ఉత్సవాల ప్రారంభం రోజైన ఈనెల 14న తిరిగి ఆమె పెడన చేరుకుంటారు.



పట్టాభి సీతారామయ్య గృహాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న ముడా చైర్మన్ మట్టా ప్రసాద్

పట్టాభి ముందుచూపు అందరికీ ఆదర్శం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య ముందు చూపు అందరికీ ఆదర్శమని ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. మచిలీపట్నం పోర్టు రోడ్డులోని పట్టాభిసీతారామయ్య ఇంటిని సోమవారం ఆయన సందర్శించారు. మహాత్మాగాంధీ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. మహిళలు కుట్టు శిక్షణను పరిశీలించారు. గాంధీ కస్తూర్బా సంఘ నాయకులు శింగరాజు గోవర్ధన్ కార్యక్రమాలను వివరించారు. శిథిలమైన భవనానికి రూ.14 లక్షలతో మరమ్మతులు చేయించామన్నారు. బీజేపీ నాయకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, పంతం గజేంద్ర, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పైడమ్మ ఆలయానికి రూ.16.92 లక్షల ఆదాయం

పెడన, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14 నుంచి 24 వరకు జరిగే పైడమ్మ జాతరను పురస్కరించుకుని బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ. 16 లక్షల 92 వేల ఆదాయం లభించిందని ఈవో తిక్కిశెట్టి వీరవెంకటమోహనరావు తెలిపారు. ఆలయం చుట్టూ ఖాళీ ప్రదేశంలో షాపులకు రూ.15.20 లక్షలు, శిడిబండ్ల కు రూ. 70 వేలు, లడ్డూ ప్రసాదం విక్రయాలకు రూ. 54 వేలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కుకు రూ. 22వేలు, చీరలు, జాకెట్ల విక్రయానికి రూ.26 వేలు ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఆలయానికి అదనంగా రూ.1,84,500 ఆదాయం లభించిందని ఈవో తెలిపారు.



రైసుమిల్లు వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న కూటమి నాయకులు

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

కోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, రైసు మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని కూటమి నాయకులు కోరారు. కోడూరు రైతు సేవా కేంద్రం వద్ద అధికారుల నుంచి ధాన్యం కొనుగోలు వివరాలను తెలుసుకున్నారు. గోనె సంచులు వెంటనే అందించి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. కూటమి నేతలు బండే శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరిరావు, దామెర్ల నారాయణ, బచ్చు వెంకటేష్, చింతల రమేష్, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, పిల్లి మల్లిఖార్జునరావు, గోగినేని సోమశేఖర్‌రావు, మేడ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయికి శక్తి టీం అడ్డుకట్ట

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడి పోలీసుస్టేషన్ పరిధిలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న ఆకతాయిలను శక్తిటీమ్ సోమవారం అదుపులోకి తీసుకున్నారు. లేడీ యాంప్తిల్ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులను ఈవ్‌టీజింగ్‌కు చేస్తున్న ఆకతాయిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ అబ్దుల్ నబీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆకతాయి తల్లిని పిలిపించారు. పిల్లలను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

డ్రై ఫ్రూట్స్ షాపులపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల దాడి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని డ్రై ఫ్రూట్స్ షాపులపై సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దాడులు జరిపారు. నాణ్యతాప్రమాణాలు పాటించకుండా, లైసెన్స్‌లు లేకుండా సొంత ప్యాకింగ్ చేసి అమ్మకాలు జరుపుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. కోనేరు సెంటర్‌కు దగ్గరలోని డ్రైఫ్రూట్ షాపులను తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ అథారిటీ ఇండియా లైసెన్స్ లేకుండా అమ్ముతున్నారని దాడుల్లో తేలింది.

ఆనవాళ్లు లేని డ్రెయిన్

మండల కేంద్రం మోపిదేవి పంచాయతీ శివారు వార్పు వరకు జాతీయ రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్ పూర్తిగా పూడిపోయింది. జాతీయ రహదారి విస్తరణలో కొంత పూడ్చివేయగా, స్థానికులు, చిరు వ్యాపారులు మరికొంత ఆక్రమించేడంతో డ్రెయిన్ ఆనవాళ్లు కనపడడం లేదు. దీంతో రైతుల పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. పూడికతీత పనులు ఈ ఏడాదైనా చేపడతారా లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

- జాతీయ రహదారి విస్తరణలో కొంత పూడ్చేశారు!
- మరికొంత స్థానికులు ఆక్రమించేశారు!



ఇటుక రాయి గుట్టలతో పూడ్చివేయడంతో కన్పించకుండా పోయిన డ్రెయిన్



బండికోళ్లలంక అడ్డరోడ్డు వద్ద ముళ్లచెట్లతో కన్పించని డ్రెయిన్, పూడుకుపోయిన కల్వర్టు

(ఆంధ్రజ్యోతి-మోపిదేవి)

మోపిదేవి బండికోళ్లలంక అడ్డరోడ్డు నుంచి మోటపిదేవి వార్పు వద్ద ఉన్న 12వ నెంబర్ పంట కాలువ వరకు ప్రధాన రహదారి పక్కనే రెండు కిలోమీటర్ల మేర డ్రెయిన్ ఉంది. దాదాపు 300 ఎకరాలు వరి పొలాల నుంచి వచ్చే మురుగు, ప్రజాశక్తినగర్ కాలనీ, మోపిదేవి వార్పు కాలనీలకు చెందిన 400 కుటుంబాల మురుగుపారుదలకు ఈ డ్రెయిన్‌ను కొన్ని దశాబ్దాలుగా వినియోగిస్తున్నారు. ఇటీవల 216ఏ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా డ్రెయిన్‌ను కొంత మేర పూడ్చివేయగా, కాలనీలకు చెందిన గృహాలు, చిరువ్యాపారులు ఆక్రమించుకుని రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్‌ను ఆనవాళ్ల లేకుండా చేశారు. రహదారి వెంబడి నిర్మించిన వేబ్రిడ్జి నిర్వాహకులు పూర్తిగా డ్రెయిన్‌ను పూడ్చివేశారు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు, వరదలు వచ్చిన సమయంలో నివాస గృహాల్లోకి నీరు చొచ్చుకువస్తోంది. 300 ఎకరాలకుపైగా పంటలు నీటి ముంపునకు గురవుతున్నాయి. ఇటీవల వచ్చిన అధిక వర్షాలు, కృష్ణానది వరదల నేపథ్యంలో వరి, వాణిజ్య పంటలు నీటిముంపుకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. కృష్ణానది వరదల సమయంలో రైతులు, గ్రామస్థుల ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు తాత్కాలికంగా డ్రెయిన్ పూడికతీత చేపట్టారు. అనంతరం తిరిగి డ్రెయిన్‌ను పూడ్చివేసి యధావిధిగా ఆక్రమణల పర్వం కొనసాగించారని రైతులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారులు, ఇతర అధికారుల దృష్టికి అనేక పర్యాయాలు తీసుకెళ్లినప్పటికీ ఇదిగో చేస్తాం.. అదిగో చేస్తామంటూ కాలయపన చేస్తున్నారే గానీ డ్రెయిన్ పునరుద్ధరణ జరగటం లేదని రైతులు వాపోతున్నారు. మరొక పర్యాయం ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులు నష్టపోకముందే అధికారు లు జాతీయ రహదారి వెంబడి ఆక్రమణలకు గురైన డ్రైనేజీని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రెయిన్ పునరుద్ధరణ పనులు చేపట్టాలి



కొక్కిలిగడ్డ వెళ్లే రహదారి నుంచి మోపిదేవి వార్పు వరకు డ్రెయిన్ గడిచిన మూడేళ్లుగా పూర్తిగా ఆక్రమణలకు గురైంది. వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట పొలాల్లోని మురు గు బయటకు వెళ్లే పరిస్థితి లేక ప్రతి ఏడాది పంటను నష్టపోవాల్సి వస్తోంది. డ్రైనేజీ పునరుద్ధరణపై అధికారులకు అనేక పర్యాయాలు వినతిపత్రాలు అందజేశాం. వేసవిలోనైనా డ్రైనేజీ పునరుద్ధరణ పనులు చేసి రైతులను ఆదుకోవాలి.

- బొందలపాటి వెంకటేశ్వర ప్రసాద్, రైతు



నాగులేరులో అరటి దొప్పల్లో దీపాలు వదిలి పోలిని స్వర్గానికి పంపుతున్న మహిళలు



రామలింగేశ్వరస్వామి ఆలయంలో కృత్రిమ కొలనులో దీపాలు వదులుతూ..

భక్తిశ్రద్ధలతో పోలిస్వర్గం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం ముగిసిన సందర్భంగా నాగులేరు వద్ద సోమవారం తెల్లవారుజామున వేలాది మహిళలు పోలిని స్వర్గానికి పంపే కార్యక్రమంలో భాగంగా వేలాది మంది మహిళలు దీపారాధనలు చేశారు. అరటి డొప్పల్లో సంప్రదాయ సిద్ధంగా దీపాలు వెలిగించి పోయిరావమ్మా..పోలి..అం టూ నాగులేరులో వదిలిపెట్టారు. తెల్లవారుజాము 4 నుంచి ఉదయం 7 గంటల వరకు దీపారాధనలు చేస్తూనే ఉన్నారు. ఇనకుదురు సీఐ పరమేశ్వర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. శక్తిటీమ్ సహకారంతో నాగులేటి ఒడ్డు న ఏర్పాట్లు చేశారు. రసలింగేశ్వరుని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

● నాగులేటి వద్ద మహిళల దీపారాధనలు

రాబర్ట్సన్ పేటలోని రామలింగేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో కృత్రిమ కొల ను ఏర్పాటు చేశారు. నిలువెత్తు పరమశివుని ఎదురు గా మహిళలు దీపారాధనలు చేశారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

వేకనూరులో

అవనిగడ్డ రూరల్ : కార్తీక మాసం ముగింపును పురస్కరించుకుని వేకనూరులోని కృష్ణానది వద్ద మహిళలు ప్రత్యేక పూజ లు చేశారు. మహిళలు అరటి డొప్పలలో దీపా లు వెలిగించి కృష్ణానదిలో వదిలారు. మహిళలు పోలిమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు.

శ్రీరామపాద క్షేత్రంలో..



నాగాయలంక : పోలిని స్వర్గాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామపాదక్షేత్రంలోని పుష్కరఘాట్‌కు వచ్చి మహిళలు అరటి దొప్పలలో దీపాలను వెలిగించి నదిలోకి వదిలారు. పోయి రావమ్మ.. పోలి అంటూ వీడ్కోలు పలికారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

మీకోసం అర్జీలకు శాశ్వత పరిష్కారం

మచిలీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో సోమవారం డీఆర్వో చంద్రశేఖరరావు, ఏఎస్పీ వీవీ నాయుడుతో కలిసి ప్రజలనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మీకోసంలో వచ్చిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి వెంటనే కౌంటర్‌లు దాఖలు చేయాలన్నారు, డీఆర్వో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ వాహనాల ఫిట్‌నెస్‌కు సంబంధించిన వివరాలను ఈనెల 15వతేదీ నాటికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పించండి

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రయోజనాలపై రైతులకు కనీస అవగాహన కల్పించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పథకం అమలుపై జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. బాలాజీ మాట్లాడు తూ, ప్రకృతి విపత్తుల కారణంగా రైతులు పంటలను కోల్పోతే ఫసల్ బీమా యోజన కింద బీమా పరిహారం అందుతుందన్నారు. రబీ సీజన్‌లో మినుము పంటకు ఎకరానికి రూ.80, వరికి రూ.84, పెసర కు రూ.36 పంట బీమా ప్రీమియంగా చెల్లిస్తే సరిపోతుందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం బ్రోచర్‌ను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. జేసీ గీతాంజలిశర్మ, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, డీడీ మనోహర్, కేడీసీసీ బ్యాంక్ సీఈవో శ్యామ్‌మనోహర్, ఎల్‌డీఎం రవీంద్రారెడ్డి, సిటిజన్ సర్వీస్ సెంటర్ రాష్ట్ర మేనేజర్ రాజాబాబు, సీపీవో గణేష్ కృష్ణ, ఉద్యానశాఖ అధికారి జ్యోతి, బీమా కంపెనీ ప్రతినిధి మహేష్, రైతుప్రతినిధులు కాగిత వెంకటేశ్వరరావు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లపై ఫిర్యాదులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో అనుమతులు లేకుండా వేస్తున్న లే అవుట్లపై సోమవారం కలెక్టర్ బాలాజీకి పలువురు ఫిర్యాదు చేశారు. బందరుకోటలో వేసిన లే అవుట్‌కు పర్మిషన్ లేదంటూ మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్‌కుమార్ ఫిర్యాదు చేశారు.

బంటుమిల్లి సమస్యలపై సీపీఎం అర్జీ

బంటుమిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కారం కోరుతూ సీపీఎం నాయకులు తహసీల్దార్ భరత్‌రెడ్డికి సోమవారం అర్జీ అందజేశారు. బంటుమిల్లి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, బైపాస్ రోడ్డును వినియోగంలోకి తీసుకు రావాలని, జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మాజేటి శివశ్రీనివాసరావు, అజయ్‌ఘోష్, బొడ్డు నాగరాజు, పొదిలి వెంకన్న, రాంబాబు, వెంట్రపాటి శ్యామ్, గౌరిశెట్టి నాగేశ్వరరావు, వంగల రాజు, తదిరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లపై శ్రద్ధ చూపాలి : శొంఠి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ హాస్టళ్లలో భోజన వసతి సదుపాయాలు సరిగా ఉండటం లేదని, వీటిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర చైర్మన్ శొంఠి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పలు బీసీ హాస్టళ్ళలో కాస్మోటిక్ ఛార్జీలు చాలక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ప్రాణాపాయస్థితిలో సీపీఆర్‌తో రక్షణ

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడగలమని ఆరోగ్య భారతి కార్యకర్త డాక్టర్ వంగర శేషగిరిరావు అన్నారు. పులిగడ్డ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎస్.టి. పి.కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 46 చౌక ధరల దుకాణాల డీలర్ల నియామకాని ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో స్వాతి కోరారు. మచిలీపట్నంలో 20, బంటుమిల్లిలో 2, పెడనలో 8, అవనిగడ్డలో 2, మోపిదేవిలో 1, నాగాయలంకలో 3, చల్లపల్లిలో 1, గూడూరులో 5, కోడూరు లో 2, కృత్తివెన్నులో 1, ఘంటసాలలో 1 ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులను నిర్ణీత ప్రొఫార్మాలో ఆర్డీవో కార్యాలయానికి అందజేయాలన్నారు. వివరాలకు తహసీల్దార్లను సంప్రదించవచ్చన్నారు.